తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
జ్రా. జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
మంగళవారం | పేజీలు - 8



# విద్యార్థులకు యూనిఫార్మ్స్ ఇచ్చేనా..?

- వరంగల్ జిల్లాలో 694 పాఠశాలలు, 34 వేల మంది విద్యార్థులు
- ఈనెల 15న పాఠశాలల ప్రారంభం



**వరంగల్ బ్యూరో, జూన్ 08 (జనం సాక్షి)** : పాఠశాలలు ప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు యూనిఫామ్స్ కూడా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వరంగల్ జిల్లాలో మొత్తం 694 పాఠశాలలు ఉండగా అందులో 34,000 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే మరోవారం రోజుల్లో నూతన (2026-27) విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతోంది. పాఠశాలలు పునః ప్రారంభం రోజే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం నుంచి జిల్లా విద్యాశాఖ అధికారులు పాఠ్యపుస్తకాలు, దుస్తులు అందించడం జరుగుతుంది. కానీ ఈ ఏడాది విద్యార్థులకు స్కూల్ పునః ప్రారంభం రోజు దుస్తులు వచ్చేలా లేవు అనే అనుమానం కలుగుతుంది. కనీసం ఈ నెల చివరి నాటికి కూడా దుస్తులు వస్తాయా అంటే వచ్చేలా కనిపించడంలేదని విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల ద్వారా తెలుస్తోంది. క్లాత్ మెటీరియల్ కు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి కూడా జిల్లా విద్యాశాఖ అధికారులకు ఏ సమాచారం లేదని తెలుస్తోంది. గతేడాది ఏప్రిల్ నెలాఖరులో డ్రెస్ మెటీరియల్ మండల కేంద్రాలకు చేరింది. గతేడాది మే నెల నాటికి కొన్ని దుస్తులు కుట్టడం కూడా జరిగింది. కానీ ఈ ఏడాది ఇంకా క్లాత్ మెటీరియల్ మండల కేంద్రాలకు చేరనే లేదనేది సమాచారం.. దీంతో విద్యార్థుల స్కూల్ యూనిఫామ్స్ పై నీలి నీడలు కమ్ముకున్నాయి. దీంతో కొత్త విద్యాసంవత్సరం క్లాసులకు గతేడాది ఇచ్చిన పాత దుస్తులతోనే విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే పరిస్థితి కనిపిస్తుంది. కాగా వేసవి సెలవులకు ముందే వివిధ పాఠశాలల్లోని విద్యార్థుల దుస్తుల కొలతలు అధికారులు తీసుకోవడం గమనార్హం. ముందే కొలతలు తీసుకున్న అధికారులు తరగతులు పునః ప్రారంభమయ్యే కాలం సమీపిస్తున్నా డ్రెస్ మెటీరియల్ అందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈసారి ఎందుకు ఇంత ఆలస్యం అయిందనేది ప్రశ్నగామిగుతోంది. ఈ విషయంలో ప్రభుత్వము ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విద్యార్థులకు పాఠశాల ప్రారంభం రోజే యూనిఫామ్స్ అందిస్తారని ఆశాభవాన్ని విద్యార్థులు వారి తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు.



# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ బ్యూరో, జూన్08,(జనంసాక్షి) వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, సోమవారం సాయంత్రం సారంగాపూర్ మండల కేంద్రం, యాకర్ పల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. అధికారులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం, ఇంకా పూర్తి చేయాల్సిన కొనుగోలు ఎంత ఉందో అడిగారు. ధాన్యం కొనుగోలు పూర్తయిన ఇతర ప్రాంతాల నుంచి హమాలీలను అదనంగా సమకూర్చుకొని ధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. స్థానిక రైతులతో మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు ధాన్యం కొనుగోలుపై ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని, మిగిలిన ధాన్యం కొనుగోలు, తరలింపు ప్రక్రియ తక్షణమే పూర్తి చేస్తామని అన్నారు. అనంతరం ఖానాపూర్ మండల కేంద్రం, మస్కాపూర్ గ్రామంలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. మొత్తం కొనుగోలువెంటనే పూర్తి చేయాలన్నారు. ఈ తనిఖీలలో కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్ తహసిల్దార్లు విజయ కాంతారావు, సుజాత, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# క్షేత్ర స్థాయి అవగాహన అధికారులకు అత్యంత కీలకం

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ
- తెలంగాణ దర్శన్‌లో భాగంగా జిల్లాలో ఆరుగురు ట్రైనీ ఐఏఎస్‌ల పర్యటన
- పాండవులగుట్ట, కేటీపీపీ, సింగరేణి గనులు సందర్శించిన అధికారులు

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రభుత్వ విధులు నిర్వహించే ప్రతి అధికారికి క్షేత్ర స్థాయి అవగాహన అత్యంత కీలకం. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలంటే గ్రామీణ, స్థానిక పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకోవాలి అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. డా. ఎం.సి.ఆర్ హెచ్.ఆర్.డి ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 2025 బ్యాచ్ ఐఏఎస్ అధికారుల శిక్షణలో భాగంగా "తెలంగాణ దర్శన్" కార్యక్రమం కింద ఆరుగురు ట్రైనీ ఐఏఎస్ అధికారులు జూన్ 7, 8 తేదీల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. మహబూబ్‌నగర్ నుండి ఎట్టబోయిన సాయి శివాని, వికారాబాద్ నుండి సచిన్ బసవరాజ్ గుత్తూర్, నల్గొండ నుండి నెలటూరి మిగతా 10లో..

# మన ఇసుక వాహనం పథకం ద్వారా ఇసుకను కేటాయించాలి

- ఇసుక అక్రమ రవాణా నివారణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేటు ఆసుపత్రులు కార్యకలాపాలు నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్
- జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్



**మహబూబాబాద్ బ్యూరో, జూన్ 08 (జనం సాక్షి):.** కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ డాక్టర్ శబరిష్, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్ జిల్లాలోని అక్రమ ఇసుక రవాణా, మన ఇసుక వాహనం పథకం అమలు, లింగ నిర్ధారణ పరీక్షలు, మాతా శిశు సంరక్షణ,క్లినికల్ హాస్పిటల్ అనుమతులు, తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం సూచించిన ప్రకారం ఇసుకను అందించాలని, ఇసుక రీచ్ లు కలిగిన ప్రదేశాలలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు, అందుకోసం జిల్లాస్థాయి ఇసుక టాస్క్ ఫోర్స్ కమిటీని నియమించడం జరిగిందని అందులో ఆర్డీవో, ఎడి మైనింగ్, పోలీస్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి, రవాణా శాఖ అధికారి, తదితరులు ఉంటారని, ఈ యొక్క కమిటీ పూర్తిగా మన ఇసుక వాహనం పథకం అమలు, ఇసుకను అక్రమంగా తరలించకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. కేవలం ఉదయం పూట మాత్రమే ఇసుక రవాణా చేసే విధంగా ఏర్పాటు చేయాలని ప్రత్యేక పోస్టులు నియమించాలని పోలీస్ రెవెన్యూ అన్ని విభాగాల ను ఆదేశించారు. మిగతా 10లో..

## పుష్కర స్నానానికి బయలుదేరిన శ్రీ ఆర్యవైశ్య వాసవి మాత పరపతి సంఘం



**వరంగల్ మండలం, జూన్ 08 (జనం సాక్షి)** శ్రీ ఆర్యవైశ్య వాసవిమాత పరపతి సంగం మహాత్మా గాంధి రోడ్ ఆధ్వర్యంలో యమునా పుష్కర పవిత్ర స్నానానికై మధుర బయలుదేరిన 100 కు పైగా సభ్యులు.దేవగురువు బృహస్పతి కర్కాటక రాశిలో ప్రవేశం మొదలు యమునా నది పుష్కర సంరంభం ఆరంభం జరిగింది. ఈ సందర్భంగా 100 కు పైగా సభ్యులతో శ్రీ ఆర్యవైశ్య వాసవిమాత పరపతి సంగం మహాత్మ గాంధీ రోడ్డు ఆధ్వర్యంలో యమునా పుష్కర స్నానికై మధుర రైల్లో లో సోమవారం బయలు దేరారని సంఘం అధ్యక్షులు ఇరుకుల్ల రమేశ్ తెలియ చేశారు.ప్రతీ సంవత్సరం కూడా సాధారణ సభ్యులతో మరియు ప్రత్యేకంగా సభ్యులతో దేశంలో ఉన్న పుణ్య క్షేత్ర సందర్శన ఉంటుందని అధ్యక్షులు రమేశ్ తెలియచేసారు.అవిభాజ్య స్నేహితం సమాజానికి అత్యవశ్యకమని వారు అన్నారు , ఐకమత్యంగా ఉంటే ఏదైనా సాధించ వచ్చునియు,నేటి రోజుల్లో ఉన్న సమయభావం వల్ల మానసికంగా ఆనందంగా ఉండటం కష్టం అవుతుందని అన్నారు, దీనికి ప్రత్నమ్యాయం కేవలం వివిధ పుణ్య క్షేత్ర సందర్శనం, దీని వల్ల లేని పని ఒత్తిడి తగ్గి ఆరోగ్యం ఆనందం కలుగుతుందని, మరియు వివిధ ప్రాంతాల సందర్శన వల్ల భిన్న సంస్కృతలపై అవగాహన కలుగుతుందనియి అన్నారు.ఈ యాత్ర ముగించుకుని మళ్ళీ 12 రాత్రి తిరిగి వస్తామని అన్నారు. ప్రయాణంలో భాగంగా వివిధ ఆలయాలతో పాటుగా ప్రపంచ ప్రసిద్ధ తాజ్ మహల్ సందర్శన సైతం ఉన్నదని అన్నారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీ ఇరుకుల్ల రమేశ్, కోశాధికారి బెజుగం రజినీకాంత్,కుంచం వీరభద్ర రావు, మరియు ఉపాధక్షులు కొత్త వెంకటకృష్ణ కరుణాకర్, దివ్వెల శ్రీనివాస్, పాలరాపు ఫణేష్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి బూరెలా సత్యనారాయణ మరియు మహిళ సంగ సభ్యులు పాల్గొన్నారు.

## 99 రోజుల ప్రజాపాలన ప్రణాళికలో భాగంగా గ్రామసభ నిర్వహణ



**కాళేశ్వరం , జూన్ 9 , ( జనం సాక్షి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో 99 రోజుల ప్రజాపాలన ప్రణాళికలో భాగంగా గ్రామ సర్పంచ్ సరిత అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎంపీడీవో రవీంద్రనాథ్, డిప్యూటీ తహసీల్దార్ యూసఫ్, విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్పందనతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రణాళికలో భాగంగా గ్రామంలోని పలు సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, వీధి విద్యుత్ దీపాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని, ప్రజలకు నిరంతర మంచినీటి సరఫరా అందించాలని సూచించారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి స్వాతి, వార్డు సభ్యులు తేజస్విని, శ్రీజ, మనక్క, దేవిక, శ్రావణి, ఆర్ ఐ రఘు, జిపిఓ రఘు, లైన్ ఇన్స్పెక్టర్ సదానందం, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సదయ్య, అంగన్వాడి టీచర్లు శ్రీకళ, సుచరిత, ఆశ వర్కర్ స్వరూప, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## తొర్రూరు మున్సిపాలిటీలో పేరుకపోయిన సమస్యలను పరిష్కరించాలి

- డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన లబ్ధిదారులకు పంచాలి.
- సిపిఎం పార్టీ జిల్లా నాయకులు బొల్లం అశోక్, ఎండి యాకూబ్‌ల డిమాండ్.



**తొర్రూరు ,జూన్ 8 (జనం సాక్షి):** తొర్రూరు మున్సిపాలిటీ కేంద్రంలో పేరుకుపోయిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం పార్టీ జిల్లా నాయకులు బొల్లం అశోక్, ఎండి యాకూబ్ లు అధికారులను కోరారు. సోమవారం రోజు మండల కేంద్రంలో మున్సిపాలిటీ కేంద్రంలో జరిగిన 9,10 వార్డు సభ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ లకు సిపిఎం పార్టీ తొర్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో కూడిన వినతి పత్రం అందజేయడం జరిగింది. అనంతరం సిపిఎం పార్టీ జిల్లా నాయకులు బొల్లం అశోక్ తొర్రూరు మండల కార్యదర్శి ఎండి యాకుబ్ లు మాట్లాడుతూ, తొర్రూరు పట్టణ కేంద్రంలో నిర్మాణం పూర్తయిన 280 డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలకు పంచాలని వారు డిమాండ్ చేశారు. చాలాకాలం నుండి ఇదిగో పంచుతాం అదిగో పంచుతామని పేద ప్రజలకు ఆశలు చూపుతూ, ప్రజలు మభ్యపెడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో మొదటి విడతలో మంజూరైన ఇందిర ఇండ్లు పూర్తిస్థాయిలో లబ్ధిదారులు నిర్మాణం చేసుకోలేదని, నిర్మాణం చేయని, ఇండ్లను కట్టుకోగలిగిన లబ్ధిదారులకు ఇచ్చి, వృధా కాకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ కమిషనర్ పాలకవర్గం పైన ఉందని వారు ఈ సందర్భంగా తెలిపారు. చాలాసార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన అప్పటికి కూడా, పట్టీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని వారు అన్నారు.9,10 వార్డులు పాత ఊరు కావడం వల్ల గల్లీ ఇరుకుగా ఉండి, చెత్త తీసుకురావడానికి ట్రాక్టర్ గల్లీలలోకి పోవడం లేదని, వాటిని ట్రాక్టర్లు, వేరే వెహికల్స్ పోయే విధంగా వెడల్పు చెయ్యాలని, అదేవిధంగా అస్తవ్యస్తంగా ఉన్నటువంటి సీసీ రోడ్లు డ్రైనేజి పనులను పూర్తి చేసి ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని వారు అధికారులను కోరారు. పై సమస్యల పరిష్కారం కోసం అధికారులు పాలకవర్గం కృషి చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని లేకుంటే ప్రజలందరిని కలుపుకొని సిపిఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన,పోరాటాలు నిర్వహిస్తామని వారు అధికారులను, ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి జమ్ముల శ్రీను, వెంకట్ రెడ్డి, తిమ్మడి రవి, యాకన్న, శ్రీరంగం రామకృష్ణ ,రాధ, దస్తరి భాగ్య, ఎండి షమీనా, అమీనా శోభ, శ్రీలత లక్ష్మి, చెన్నమ్మ, సౌజన్య, శాంతమ్మ, ఈగ శోభ తదితరులు పాల్గొన్నారు.

## బస్సు డ్రైవర్ నిర్లక్ష్యానికి వ్యక్తికి గాయాలు



**సారంగాపూర్,జూన్6(జనం సాక్షి)** సారంగాపూర్ మండలం బీరవెల్లి గ్రామానికి చెందిన షేక్ మౌలాన (50) అను వ్యక్తి తన ద్విచక్ర వాహనం పైన ఇంటి నుండి బీరవెల్లి బస్టాండ్ వైపు వెళ్తుండగా నిర్మల్ డిపో కి చెందిన ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో మౌలాన కి కాళ్లకు, నడుము భాగంలో తీవ్ర గాయాలయ్యాయి బాధితుడిని వెంటనే 108 అంబులెన్సు ద్వారా నిర్మల్ ఏరియా ఆసుపత్రి లో చేర్పించడం జరిగింది. ఆర్టీసీ డ్రైవర్ జాదవ్ లక్ష్మణ్ పైన కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

### ఇండస్ట్రియల్ కరెంట్ పోల్ ఢీకొన్న ఆటో..

## తృటిలో తప్పిన పెను ప్రమాదం



**సారంగాపూర్,జూన్ 7(జనం సాక్షి)** సారంగాపూర్ మండలంలోని గోపాల్పేట్ ఎక్స్ రోడ్ నుంచి సారంగాపూర్ వెళ్లే మార్గంలో ఆదివారం ఓ ఆటో ఇండస్ట్రియల్ కరెంట్ లైన్ విద్యుత్ పోల్ ఢీకొట్టింది. ఈ ఘటనలో విద్యుత్ పోల్ కిందపడిపోవడంతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అటువైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే ఘటన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు..

## ప్లాస్టిక్ నివారిద్దాం.... పర్యావరణాన్ని కాపాడుదాం




**సారంగాపూర్,జూన్8(జనం సాక్షి)** ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్లాస్టిక్ నిర్మూలనపై సోమవారం సమావేశం ఏర్పాటుచేశారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శ్రీ ఎం.డి. నజీర్ ఖాన్, ఉప అటవీ క్షేత్రాధికారి, సారంగాపూర్ అధ్యక్షతన మండలంలోని అడెల్లీ నందనవనంలో ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా నందనవన పరిసరాల్లో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు మరియు ఇతర చెత్తాచెదారాన్ని తొలగించి పరిశుభ్రత చేశారు. కార్యక్రమంలో ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఆదివారం అడెల్లి నందనవనానికి వేలాది మంది భక్తులు విచ్చేసి విందు, వినోద కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్లాస్టిక్ ప్లేట్లకు బదులుగా స్టీల్ ప్లేట్ల వినియోగాన్ని ప్రోత్సహించే కార్యాచరణ చేపట్టాలని సమావేశంలో చర్చించారు. హాజరైన పలువురు దాతలు స్టీల్ ప్లేట్లను విరాళంగా అందించేందుకు ముందుకు వచ్చారు. త్వరలో అడెల్లి నందనవనంలో ప్లాస్టిక్ ప్లేట్ల స్థానంలో స్టీల్ ప్లేట్ల వినియోగాన్ని అమలు చేయడానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శ్రీ దండు సాయన్న సర్పంచ్, అడెల్లి,అజీజ్ ఖాన్ఎంపీవో, శంకర్ ప్రిన్సిపాల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, అడెల్లి గ్రామ వి.డి.సి. చైర్మన్, సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, వెన్నెల సుజాత ఎఫ్‌బిఓలు పాల్గొన్నారు.

## కాకతీయ యూనివర్సిటీలో పీజీ పరీక్షలు ప్రారంభం



**హనుమకొండ ప్రతినిధి జూన్ 8 (జనం సాక్షి) :** కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు అనుబంధ కళాశాలలలో ఎం.ఏ., ఎం.కామ్., ఎం.ఎస్‌సి. నాలుగవ సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరుగుతున్న పరీక్షల నిర్వహణను ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి పరిశీలించారు.పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు. విద్యార్థులకు నిరంతర విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు పరీక్ష సమయానికి అర్థగంట ముందుగా కళాశాలకు చేరుకోవాలని సూచించారు. ఈ పరీక్షలు ఈనెల 19వ తేదీ వరకు నిర్వహించబడతాయని తెలిపారు. ఉదయం 10 గంటల నుండి ఒంటిగంట వరకు నిర్వహించబడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రెహమాన్, పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**సారంగాపూర్, జూన్ 7(జనం సాక్షి)** నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం కౌట్ల బిజెపి హెచ్ ఎస్ ఉన్నత పాఠశాలలో 2006- 07 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం స్థానిక కర్ణాకర్ రెడ్డి ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా ఆప్యాయంగా పలకరించుకొని చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 18 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం వల్ల ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలను పంచుకున్నారు. గురువులను ఆప్యాయతగా పలకరించి ఆశీర్వాదం పొందారు. ఒక్కొక్కరు వారి జీవితంలో ఎదుర్కొన్న సమస్యలను ఒడిదోడుకులను అందరి ముందు పంచుకున్నారు. అనంతరం విందు ఆరగించి ఎవరి ఇంటికి వారు పయనమయ్యారు.ఈ కార్యక్రమంలో గురువులు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## అంబులెన్స్ సేవలు అభినందనీయం



సారంగాపూర్ మండలం పెండల్దారి గ్రామానికి చెందిన పెందుర్ దీప (28)కి పురిటి నొప్పులు ఎక్కువ అవడంతో సోమవారం కుటుంబ సభ్యులు వెంటనే 108కాల్ చేయడంతో నిర్మల్‌కి తీసుకెళ్తున్న క్రమంలో పురిటి నొప్పులు ఎక్కువ అవడంతో మార్గ మధ్యలో డాక్టర్ సూచనలు మేరకు డెలివరీ చేశారు.పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది.తర్వాత హాస్పిటల్ లో జాయిన్ చేశారు.తనకు మూడవ కాన్పులో (అంతకు ముందు ఇద్దరు ఆడ పిల్లలు ప్రస్తుతం మగ బిడ్డ పుట్టడం చాలా సంతోషంగా ఉందని తల్లి తెలిపింది .దీంతో కుటుంబ సభ్యులు డాక్టర్స్‌ను 108ఈఎంటి పురడి సాగర్,పైలెట్ వెలమల మహేష్‌ను అభినందించారు.

## కరెంటు షాక్‌తో మృతి చెందిన కుటుంబానికి

### పరామర్శించిన ఎస్టీ యూనియన్ అధ్యక్షులు: రాథోడ్ రామారావు



**సారంగాపూర్,జూన్8(జనం సాక్షి)** నిర్మల్ జిల్లా పెంబి మండలం కోయటి కంటి తండా యందు గత వారం రోజుల కిందట ఐరన్ ఫ్యాన్ కరెంట్ షాక్ తో ఒకే కుటుంబానికి చెందిన తండ్రి కొడుకులు మృతి చెందారు. వారి ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యులకు పరామర్శించిన యస్ టీ యూనియన్ నిర్మల్ జిల్లా ప్రెసిడెంట్ రామారావు రాథోడ్ ఆయన వెంట యస్ టీ యూనియన్ నిర్మల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ప్రకాష్, యూత్ ప్రెసిడెంట్ ధన్ రాజ్ పెంబీ మండల తాజా మాజీ జడ్పీటీసీ జాను బాయి మరియు శ్రీనివాస్‌లు కలిసి పరామర్శించారు.

## సిపిఎం పార్టీ జిల్లాస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

### సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి



**బచ్చన్నపేట జూన్ 7 ( జనం సాక్షి):** ఈనెల 14, 15, 16 తేదీలలో బచ్చన్నపేట మండల కేంద్రంలో నిర్వహిస్తున్నటువంటి సిపిఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సిపిఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సిపిఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్, ఆధ్వర్యంలో విడుదల చేసిన కరపత్రం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక రకాల ప్రజా సమస్యలపై నిరంతరం అలుపెరుగని పోరాటాలు ప్రజా ఉద్యమాల కోసం సిపిఎం పార్టీ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. దేశంలో నిరుద్యోగం పేదరికం నిరక్షరాస్యత సామాజిక అణిచివేత మహిళలు మైనార్టీలు వృత్తిదారులు వ్యవసాయ కూలీలు దళితులు గిరిజనులు ఆదివాసీల అభివృద్ధి జరగాలంటే దేశంలో ఉన్న వనరుల సంపద కార్పొరేట్ దోపిడీ శక్తులకు కాకుండా సోషలిస్టు విప్లవం ద్వారానే పై సమస్యల కోసం దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని సిపిఎం పార్టీ పోరాటాల ద్వారా ప్రజలను చైతన్యం చేస్తుందని అన్నారు. బచ్చన్నపేట మండల కేంద్రంలో నిర్వహిస్తున్నటువంటి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు రావుల రవీందర్ రెడ్డి. మినలాపురం ఎల్లయ్య.నాయకులు బోదాసు సుధాకర్. బాలరాజు. రామగల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి




**నల్లబెల్లి, జూన్ 08 (జనంసాక్షి):** ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సిపిఐ మండల కార్యదర్శి బట్టు సాంబయ్య పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో ఫీజు రియంబర్స్మెంట్ బకాయలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సిపిఐ మండల పార్టీ ఆధ్వర్యంలో తాహసిల్దార్ ముప్పు కృష్ణకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ గత ఐదు సంవత్సరముల నుండి ఫీజు రియంబర్స్మెంట్ రాక విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు విద్యార్థుల కోసం ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా రేవంత్ సర్కార్ స్పందించి వెంటనే ఫీజు రియంబర్స్మెంట్ బకాయిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సమితి నాయకులు పరికి కోర్నెల్, మామిళ్ళ పెద్ద ఐలయ్య, కడియాల క్రాంతి కుమార్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పరికి రత్నం, రైతు సంఘం నాయకుడు భూస కుమారస్వామి పాల్గొన్నారు.

## నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం : బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్



**నెరడిగొండ జూన్7(జనంసాక్షి):** బోథ్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా నెరడిగొండ మండలంలోని బుద్ధికొండ నుంచి తేజాపూర్ గ్రామం వరకు రూ. 2 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుతో పాటు సీడీ వర్క్స్,సీసీ రోడ్డు పనులకు సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రోడ్లు కీలకమని,బుద్దికొండ నుంచి తేజాపూర్ రహదారి నిర్మాణం పూర్తయితే ప్రజలకు రైతులకు విద్యార్థులకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. ఇచ్చిన ప్రతీ హామీ నిలబెట్టుకునే దిశగా అడుగులు వేస్తున్నానని తెలిపారు.ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోయి గ్రామాల మధ్య అనుసంధానం బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. బోథ్ నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని,ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శివారెడ్డి మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్ స్థానిక సర్పంచ్ నవీన్ అధికారులు ఎంపీడీఓ రమేష్ ఉపసర్పంచ్ బుద్దికొండ సర్పంచ్ మహేందర్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి పద్మనాభ రెడ్డి శోభన్ రెడ్డి దేవేందర్ రెడ్డి నెరడిగొండ సర్పంచ్ రవీందర్ రెడ్డి అల్లూరి శ్రీనివాస్ రెడ్డి వడూర్ సర్పంచ్ శ్రీకాంత్ సాబ్లే ప్రతాప్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**చిట్యాల, జూన్ 08( జనం సాక్షి ):** గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చిట్యాల మండలంలోని అందుకుతండా గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో తాగునీరు, రోడ్లు, సైడ్ డ్రైన్లు తదితర మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. మహిళా సంఘ భవనం, అంగన్వాడీ భవనం నిర్మాణాన్ని మంజూరు చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే రైతులకు పంటల నిర్వహణపై అవగాహన కల్పిస్తూ, పంట అవశేషాలను కాల్చకుండా భూమి సారాన్ని పెంపొందించే పద్ధతులను వివరించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ, ఎమ్మార్వో వసంతరావు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, వ్యవసాయ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తొలకరి పలకరించే - రైతు పులకరించే



**చిట్యాల, జూన్ 08( జనం సాక్షి):** మండల వ్యాప్తంగా రైతులు వానకాలం సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఈసారి వర్షాలు తక్కువగా కురుస్తాయని వాతావరణ శాఖ తెలుపుతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా రైతులు విత్తనాలు విత్తుకోవడానికి సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తుగా సరిపడా విత్తనాలు, ఎరువులను సిద్ధంగా ఉంచింది. బ్లాక్‌లో విత్తనాలు అమ్మే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించింది. మండలాల్లో వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వర్షాలకు రైతులు దుక్కులు సిద్ధం చేస్తున్నారు. నల్లరేగడి భూము ల్లో దుక్కులను సిద్ధం చేసి కొన్ని ప్రాంతాల్లో మృగశిర కార్తె మొదటి పాదంలోనే పత్తి విత్తనాలు వేశారు. పత్తి, మొక్కజొన్న, మిర్చి,తదితర పంటలను రైతులు ఎక్కువగా సాగు చేస్తారు. పంట మార్పిడి విధానాన్ని తప్పనిసరి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. రైతులు తొందరపడి విత్తనాలు వేయవద్దని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు. మరో రెండు వర్షాలు కురిస్తే భూమిలో ఉన్న వేడిమి తగ్గుతున్నదని, తద్వారా విత్తనం వేస్తే త్వరితగతిన మొలకెత్తి మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని చెపుతున్నారు.

# ఆరోగ్య ప్రధాయిని వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

- 56 ఎకరాల్లో హాస్పటల్ భవన నిర్మాణం
- హాస్పిటల్ ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్న పరిస్థితి
- 24 అంతస్తుల భవనం 14 వ అంతస్తు వరకు వైద్య సేవలు
- 2200 పడకలు,500 మంది డాక్టర్లు 1000 మంది స్టాఫ్



**వరంగల్ బ్యూరో, జూన్ 08 (జనం సాక్షి)** ప్రజల ఆరోగ్యాలను కాపాడే ఆరోగ్య ప్రధాయిని, ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఒక సంజీవిని, దేశంలోనే అత్యంత ఖరీదైనటువంటి వరంగల్లోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్. వరంగల్ సెంట్రల్ జైల్ స్థానంలో 56 ఎకరాల 39 గుంటల భూమిలో 2021 జూన్ 21న అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వం వరంగల్ లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. సుమారు 1150 కోట్ల ఖర్చుతో ఈ హాస్పిటల్ నిర్మాణం జరుగుతుంది. ఇందులో 2200 పడకలు, 500 మంది డాక్టర్లు, 1000 మంది స్టాఫ్ పనిచేయనున్నారు. ప్రభుత్వం నిర్మిస్తున్న అత్యంత భారీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వరంగల్లో నిర్మాణం అవుతుండడం, ఆ నిర్మాణం కూడా పూర్తి కావస్తుండడం ప్రజల అదృష్టంగా భావిస్తున్నారు. ఇందులో ఇన్సైడ్ వర్క్స్, వైద్య పరికరాలు, ఆపరేషన్ థియేటర్స్ నిర్మాణం జరిగాయి.

## మొత్తం 24 అంతస్తుల భవనం

సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో మొత్తం 24 అంతస్తుల భవనాలను నిర్మించారు. ఇందులో 1 నుంచి 14 వరకు వైద్య సేవల కోసం, 15 నుండి 24 వరకు తొమ్మిది అంతస్తులు ఆయా ఫ్యాకల్టీలకు(వైద్యులకు) కేటాయించినట్లు సమాచారం. ప్రధానంగా గ్రౌండ్ ఫ్లోర్లో మెడికల్, ఆంకాలజీ, అత్యవసర సేవలు, కలర్ ఆర్థోపెడిక్, ఐసీయూ, ఫార్మసీ, స్కాన్, ట్రామా ,ఐసియు, ఎంఆర్ఐ, అల్ట్రా స్కాన్, మొదలైనవి ఏర్పాటు చేశారు. ఇక 1 వ ఫ్లోర్లో ఈ ఎన్ టి రుమటాలజీ, ఓపి, డెర్మటాలజీ, ఎక్రే, జనరల్ సర్జన్. 2 వ ఫ్లోర్ లో పిల్లల అత్యవసరవిభాగం, ఐసీయూ, నియోనటాల్, ఎక్రే, ఉంటాయి. 3 వ ఫ్లోర్లో ఐ వి ఎఫ్, ఆర్ సి వి, ట్రాన్స్ ప్లాంట్, ఆపరేషన్ థియేటర్స్ ఉంటాయి. 4 వ ఫ్లోర్లో ఈఎన్టీ, గ్యాస్ట్రో, ట్రాన్స్ ప్లాంట్, ఐసియు, మొదలైనవి ఉన్నాయి. 5 వ ఫ్లోర్లో డెంటల్, బోనుమారో, జనరల్, సర్జికల్, జనరల్ మెడిసిన్ ఉంటాయి. 6 వ ఫ్లోర్లో ఆర్థోపెడిక్ ఎమర్జెన్సీ, 7వ ఫ్లోర్ లో ఎలక్ట్రికల్, ప్లంబింగ్ సేవలు, 8 వ ఫ్లోర్లో ఒబెసిటీ, గైనకాలజీ, పీడియాట్రిక్ సేవలు, 9 వ ఫ్లోర్లో మెడికల్ ఆంకాలజీ, శ్వాసకోశ వ్యాధుల సేవలు, 10 వ ఫ్లోర్లో ప్లాస్టిక్ సర్జరీ, డెర్మటాలజీ, సేవలు, 11 వ ఫ్లోర్లో ఎండోక్రైనాలజీ, మానసిక, డ్రగ్స్ మొదలైన చికిత్సల సేవలు ఉంటాయి. 12 ఫ్లోర్లో సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ మానసిక రోగాల వార్డులు ఉంటాయి. 13,14 ఫ్లోర్లో సెమీ విఐపి ప్రైవేట్ గదులు ఉన్నాయి. 15 వ ఫ్లోర్లో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయనున్నారు.

## ప్రారంభించేందుకు వేగంగా ఏర్పాట్లు..!

దేశంలోనే అత్యున్నతమైన ఒక మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వరంగల్లో నెలకొల్పడం వరంగల్ ప్రజలే కాకుండా ఉత్తర తెలంగాణలోని జిల్లాల వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఈ హాస్పటల్ మారనుంది. అత్యవసరమైనటువంటి సేవలకు హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని ఈ హాస్పిటల్ లోనే అందుబాటులో ఉండే విధంగా వైద్య సేవలు అందనున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తోపాటు వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తోపాటు పలువురు నేతలు హాస్పిటల్ ను ప్రజలకు అందుబాటులో తెచ్చే విధంగా పనులు వేగంగా జరిగేలా నిరంతరం పాటుపడుతున్నారు. మరో రెండు మూడు నెలల్లో ఈ హాస్పిటల్ లో అన్ని విధాలుగా ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం. ఏది ఏమైనా వైద్య సేవలు అన్ని విధాలుగా అందేందుకు ఈ మల్టీ లెవెల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ త్వరగా ప్రారంభమై ప్రజల ఆరోగ్యాలకు ఆరోగ్యప్రదాయనిగా నిలవాలని ప్రజలు లక్షల కళ్ళతో ఎదురుచూస్తున్నారు.

# డీలర్లకు అవగాహన కల్పించిన ఏవో నాగరాజు



**లక్ష్మణ చందా, జూన్ 8,(జనం సాక్షి)** మండలంలోని డీలర్లకు రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి నాగరాజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు తప్పనిసరిగా స్టాక్ రిజిస్టర్ లు మెయింటెనెన్స్ చేయాలి. ఖరీఫ్ లో ఎల్నినో ప్రభావంతో వర్షాలు తక్కువ కురిసే అవకాశం ఉన్నందున ఖరీఫ్ కు అనుగుణంగా అంతర్గత పంటలకు రైతులను ప్రోత్సహించాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం గుర్తించిన వరిలో సన్న రకాలను వాడాలని కోరారు. ఈ సంవత్సరం ప్రతి ఎకరానికి రెండు యూరియా బస్తాలు మాత్రమే వస్తాయని తెలిపారు. రైతులకు ఇబ్బంది కలగకుండా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వం చూయించిన నిబంధనలు పాటించని మరియు వాటిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని మరియు వారిపై లైసెన్సులు రద్దు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ ఐ శ్రీనివాస్ వర్మ, ఏ ఈ వో లు పవిత్ర, సుస్మిత, మౌనిక లతో పాటు డీలర్ లు శ్రీనివాస్, ముంతాజ్ ,మనోహర్, రాజు మరియు తదితరులు పాల్గొన్నారు.

# గుమ్మల అశోక్‌ను పరామర్శించిన టీయూడబ్ల్యూజే నాయకులు



**నిర్మల్ టౌన్, జూన్ 8: (జనంసాక్షి)** టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మల అశోక్ ఇటీవల జరిగిన వాహన ప్రమాదంలో గాయపడి చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న టీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు సోమవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొండూరి రవీందర్, ప్రధాన కార్యదర్శి వెంకగారి భూమయ్య, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ యోగేష్ కుమార్‌లు అశోక్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకుని తిరిగి విధుల్లోకి రావాలని ఆకాంక్షించారు. గుమ్మల అశోక్‌కు సంఘం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ సట్ల హన్మాండ్లు, సభ్యులు బోజారెడ్డి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రంలోని జనకాపూర్ కాలనీలో క్షుద్ర పూజలు కలకలం



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 08(జనంసాక్షి ):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ పట్టణంలోని జన్కపూర్ కాలనీలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. వివరాల్లోకి వెళితే జనకాపూర్ కాలనికి చెందిన జాడి లింగయ్య అనే వ్యక్తి ఇంటి ఎదుట రాత్రి పూట ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కుంకుమ,పసుపు,ఎముకలు పెట్టి క్షుద్ర పూజలు నిర్వహించారు. గతంలో ఎప్పుడు కూడా ఇలాంటి సంఘటనలు తమ కాలని లో జరగలేదని,ఈ సంఘటనతో కుటుంబ సభ్యులతో పాటు కాలనీ వాసులు భయాందోనకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటన వలన కాలనీ వాతావరణం భయాందోళనకరంగా మారింది. జాడి లింగయ్య కుటుంబసభ్యులు పోలీసులకు సమచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు ను వేగవంతం చేశారు.

# 17,19వ వార్డుల్లో వార్డు సభలు



**రామకృష్ణాపూర్, జూన్ 08 (జనంసాక్షి):** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 17, 19వ వార్డులలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం వార్డు సభలను నిర్వహించారు. 19వ వార్డులో స్థానిక ప్రజలు పలు సమస్యలపై వార్డు కౌన్సిలర్ రంగ లక్ష్మి-రాజు, సంబంధిత అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీ, పిచ్చి మొక్కల తొలగింపు, ఇండ్లపై ఉన్నటువంటి విద్యుత్ తీగలు, ఇతర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే 17వ వార్డులో అభివృద్ధి పనులు కొనసాగడం లేదని కమిషనర్ మారుతి ప్రసాద్ ను స్థానికులు నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచిన కౌన్సిలర్ వార్డులోనే అభివృద్ధి పనులు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. వార్డు సభలకు హాజరైన పట్టణ ఎస్.ఐ. జాడి శ్రీధర్ మాట్లాడుతూ పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. యువత గంజాయి, మత్తు పదార్థాలు, మద్యపానానికి దూరంగా ఉండాలన్నారు. చైర్మన్ గోడిసెల సంధ్యారాణి మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుండి రావలసిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. వార్డు సభల్లో కమిషనర్ మారుతి ప్రసాద్, కౌన్సిలర్లు సాంబయ్య, కృపానందం, శంకర్, శ్రీనివాస్, భూమయ్య గౌడ్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి

## ఎంసిపిఐ(యు) కలెక్టరేట్ ధర్నాలో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్




**నర్సంపేట. జూన్ 8 (జనం సాక్షి)** విపరీతంగా పెరుగుతున్న ధరలను అదుపు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని ఈ క్రమంలో పేద మధ్యతరగతి ప్రజలు కనీస అవసరాలు తీర్చుకోలేక అనేక అవస్థలు పడుతున్నారని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు కనీస మద్దతు ధర (ఎం ఎస్ పి) చట్టాన్ని చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు.ఎంసిపిఐ(యు) కేంద్ర కమిటీ పిలుపుమేరకు పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఏకశిలా పార్క్ నుంచి వరంగల్ కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వచ్చి కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్. మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్పోరేట్ అనుకూల విధానాల కారణంగా ప్రజలు రైతులు కార్మికులు మరియు ఆదివాసీలు తీవ్రమైన సామాజిక ఆర్థిక మరియు పర్యావరణ సవాళ్లను ఎదుర్కొంటున్నారని, మరోవైపు ఆకాశాన్నంటిన ధరలు, ద్రవ్యోల్బణం, నిత్యవసర వస్తువుల ధరలు, ధనిక పేదల అంతరాలు, పారిశ్రామిక సంస్థలు మూతపడటం, వ్యవసాయ సంక్షోభం అలాగే పర్యావరణ పరిరక్షణ లేకపోవడం వల్ల అందరిని ప్రభావితం చేసే ప్రకృతి వైపరీత్యాలకు కారణం అవుతున్నాయని ఇలాంటి పరిస్థితుల్లో ప్రజా సంక్షేమాన్ని దేశ రక్షణను దృష్టిలో ఉంచుకొని విధానాల రూపకల్పన చేసి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. అందుకని సామాన్య ప్రజలపై భారీ ఆర్థిక భారాన్ని మోపి చమురు కంపెనీలకు ప్రయోజనం చేకూర్చే పెట్రోల్ డీజిల్ సహజవాయువు మరియు ఎరువుల ధరల పెంపును ఉపసంహరించాలన్నారు. ప్రజలకు హాని కలిగించే అమెరికా వాణిజ్య ఒప్పందం నుండి వ్యవసాయ ఉత్పత్తులు పాడి ఉత్పత్తులు పండ్లు మరియు కూరగాయలను మినహాయించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులకు అనుగుణంగా కనీసం మద్దతు ధరను నిర్ణయించి చట్టబద్ధమైన హోదా కల్పించి అంతకంటే తక్కువకు కొనుగోలు చేసే వారిపై శిక్షలు విధించాలని కోరారు. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులను మరియు ధరల కమిషన్ను చట్టబద్ధమైన సంస్థగా మార్చాలన్నారు. కార్మికులను నియంతృత్వంగా దోచుకునే విధంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దుచేసి పాత చట్టాలను యధావిధిగా అమలు చేయాలని మహిళలపై పసిపిల్లలపై పెరుగుతున్న అఘాయిత్యాలను లైంగిక దాడులను అరికట్టి రాజకీయ సంబంధం లేకుండా దోషులను కఠినంగా శిక్షించాలి. నీటి పేపర్ లీకేజీ సీబీఎస్ఈ మూల్యాంకన కుంభకోణాలపై సంబంధిత కేంద్ర మంత్రి రాజీనామా చేసేలా ఆదేశించి విద్యార్థులకు వ్యవస్థపై నమ్రత కల్పించాలని, గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే పాత చట్టాన్ని యధావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమను మరియు క్యూబా పై దాడి చేస్తామన్న బెదిరింపులను ఇరాన్ వెనిజులా పై దాడులను దేశరదుగా ఖండించాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్య శారద గారికి మెమోరాండం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ కేంద్ర నాయకులు మోర్తాల చందర్ రావు, గోనె కుమారస్వామి, సింగతి సాంబయ్య, జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, నగర కార్యదర్శి మాలోతు సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కనకం సంధ్య జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముక్కెర రామస్వామి జిల్లా నాయకులు మహమ్మద్ ఇస్మాయిల్ బాసిపాక రమేష్ అప్పనపురి నర్సయ్య మాలి ప్రభాకర్ బల్సుకురి నర్సయ్య ఐతం నాగేష్ బిట్ల సమ్మయ్య పరిమళ గోవర్ధన్ రాజు జట్టి రాజు ఉడుత గణేష్ లతోపాటు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చీకటి సాయిని పరామర్శిస్తున్న గోగుల రాణా ప్రతాప్ రెడ్డి

- జనతా ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 20 వేల ఆర్థిక సహాయం.
- చీకటి సాయికి అండగా నిలిచిన గోగుల రాణా ప్రతాప్ రెడ్డి.



**చెన్నారావుపేట, జూన్ 8 ( జనం సాక్షి ):** జనతా ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 20 వేల ఆర్థిక సహాయాన్ని జనతా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అందించారు. మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన మధ్యతరగతి కుటుంబంలో జీవనం కొనసాగిస్తున్న చీకటి చిరంజీవి చిన్న కుమారుడు సాయికి హైదరాబాద్ అపోల ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ జరిగి, కాలు, చెయ్యి సమస్యతో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి ఖర్చులకు ఇబ్బంది పడుతున్న విషయం ఆ గ్రామ యువకులు జనతా ట్రస్ట్ చైర్మన్ డా గోగుల రాణా ప్రతాప్ రెడ్డికి తెలిపారు. జనతా ట్రస్ట్ సభ్యులతో కలిసి హాస్పిటల్ కి వెళ్లి పరామర్శించి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అలాగే రూ.20 వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో దుంకదువ్వ రంజిత్, జూలూరి మనీష్, కొంకిస విఘ్నేష్, బక్కతట్ల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ తీగల సమస్య పరిష్కరించాలని ఏఈకి వినతి



**సారంగాపూర్:జూన్ 8(జనం సాక్షి)** మండలంలోని చించోలి(బి) గ్రామ పరిధిలో విద్యుత్ తీగల సమస్య కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతులు సోమవారం మండలకేంద్రంలో విద్యుత్ శాఖ ఏఈ కి వినతిపత్రం సమర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ శివారులోని వ్యవసాయ భూముల మీదుగా వెళ్లే విద్యుత్ లైన్లు ప్రమాదకరంగా తక్కువ ఎత్తులో ఉండటంతో రైతులు వ్యవసాయ పనులు నిర్వహించడంలో ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రధానంగా ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలు పొలాల్లో పనిచేసే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే విద్యుత్ తీగలు పాతబడటం, కొన్నిచోట్ల వంగిపోవడం వల్ల రైతుల ప్రాణాలు, ఆస్తులకు ముప్పు ఏర్పడుతోందని తెలిపారు. గతంలో విద్యుత్ షాక్ తో పశువులు మృతి చెందినట్లు గుర్తు చేశారు అధికారులు వెంటనే సమస్యను పరిశీలించి, విద్యుత్ తీగలను ఎత్తుగా ఏర్పాటు చేయడం లేదా అవసరమైన మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని కోరారు. సమస్యను పరిష్కరించడంలో విద్యుత్ శాఖ అధికారులు సత్వరమే చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఏఈ సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు, రైతులు నల్ల మన్మోహన్ రెడ్డి, వెల్మ భూమారెడ్డి, అకుల రాకేష్,రాజేశ్వర్, సాదం రాజేశ్వర్, లోక మోహన్ రెడ్డి తోపాటు 30 మంది రైతులు పాల్గొన్నారు.

# కలగానే నైన్‌పాక -- నేరేడుపల్లి బ్రిడ్జి



**చిట్యాల, జూన్ 08( జనం సాక్షి):** మండలం నైన్‌పాక నేరేడుపల్లి మధ్యలో మోరంచ వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి కలగానే మిగిలిపోతుందని ఎమ్మార్పీఎస్ ( టీఎస్) జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన అర్ధాంతరంగా నిలిచిపోయిన బ్రిడ్జి పనులను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ... 2022లో సుమారు రూ.6 కోట్ల వ్యయంతో ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభించినప్పటికీ ఇప్పటివరకు పూర్తి కాకపోవడం పాలకులు, అధికారుల నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపుతుందన్నారు.బ్రిడ్జి పూర్తయితే భూపాలపల్లి జిల్లా కేంద్రానికి సులభంగా చేరుకోవచ్చని ఆశించిన ప్రజల ఆశలు అడియాశలయ్యాయని తెలిపారు. ప్రస్తుతం బ్రిడ్జి పనులు నిలిచిపోవడంతో ప్రజలు సుమారు 20 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించి జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇకనైనా స్థానిక శాసనసభ్యులు, సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జి పనులను తిరిగి ప్రారంభించి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం

- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్
- ప్రజాదివాస్‌లో 15 ఫిర్యాదులు స్వీకరణ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజలు ఎలాంటి పైరవీలు, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని, చట్టబద్ధమైన విధానంలోనే న్యాయం జరుగుతుంది అని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ స్పష్టం చేశారు. శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ సంకీర్త్ ప్రజాదివాస్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన పిర్యాదుదారుల నుంచి మొత్తం 15 ఫిర్యాదులను నేరుగా స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి సంబంధిత సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి తక్షణ సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత అధికారుల సహకారంతో పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన తెలిపారు.

# రుద్రారం గ్రామ సభలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**మల్హర్,జూన్ 08(జనంసాక్షి)** మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో గ్రామ పంచాయతీ ఆవరణలో 99 రోజులు కార్యాచరణలో భాగంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ముగింపు గ్రామ సభ సర్పంచ్ చంద్రగిరి సంపత్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.గ్రామ సభకు ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం సబ్ డివిజన్ కలెక్టర్ మయాంక్ సింగ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ రాబోవు వర్షకాలం దృష్టిలో పెట్టుకొని సైడ్ కాలువలు శుభ్రం చేయాలని, వాటర్ ట్యాంకులు శుభ్రపరచాలని,ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, 2026 ప్లాంటేషన్ కార్యక్రమం, వరదలు సంభవిస్తే తీసుకునే జాగ్రత్తలు, ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు ఎంపీడీవో, తహసిల్దార్ కే రవికుమార్,మండల స్థాయి అధికారులు, గ్రామస్థాయి అధికారులు,సర్పంచ్ చంద్రగిరి సంపత్, ఉపసర్పంచ్ బడితల కుమారస్వామి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బడితల రాజయ్య,పంచాయతి కార్యదర్శి, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కోచ్ ఫ్యాక్టరీకి భగవాన్ దాస్ పేరు పెట్టాలి

- భగవాన్ దాస్ పోరాటంతోనే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ
- బీఆర్ జయంతి వేడుకలో వరంగల్ ఎంపీ కడియం కావ్య
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**హనుమకొండ ప్రతినిధి జూన్ 8 (జనం సాక్షి) :** బీఆర్ భగవాన్ దాస్ పోరాటంతోనే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఉద్యమ రూపం సంతరించుకుని నేడు నిజం కాబోతున్నదని వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. సోమవారం సీనియర్ కమ్యూనిస్టు యోధుడు, కార్మిక నాయకులు బీఆర్ భగవాన్ దాస్ 96వ జయంతి వేడుకలు హనుమకొండ అశోక జంక్షన్ లోని బీఆర్ భగవాన్ దాస్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తదితరులు బీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ భగవాన్ దాస్ పోరాటంతోనే కోచ్ ఫ్యాక్టరీ సాధ్యమై నేడు పూర్తి కాబోతున్నదని, తద్వారా ఈ ప్రాంతంలో వేలాది మంది యువతకు ఉపాధి,ఉద్యోగ అవకాశాలు అందనున్నాయని అన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి భగవాన్ దాస్ పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆయన పోరాటంతోనే కోచ్ ఫ్యాక్టరీ వచ్చిందని అన్నారు. బీఆర్ ఆశయాలకు అనుగుణంగా మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు. భగవాన్ దాస్ చూపిన బాటలో కమ్యూనిస్టు కార్యకర్తలుగా ముందుకు సాగుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, భగవాన్ దాస్ కుమారులు డాక్టర్ బి. రాజ్ సిద్దార్థ, బీఆర్ లెనిన్, బిఆర్ఎస్ నాయకులు మేడిపల్లి శోభన్ బాబు, ఆవోపా జిల్లా అధ్యక్షులు డి. ఈశ్వరయ్య, జర్నలిస్టు సంఘాల నాయకులు తోట సుధాకర్, కేకే, పి. అశోక్, గోకారపు శ్యామ్, బొడిగె శ్రీను,సిపిఐ జిల్లా నాయకులు మునిగాల బిక్షపతి, నేదునూరి రాజమౌళి, ఏదునూరి వెంకట్రాజం, కొట్టెపాక రవి, బికెఎంయూ జాతీయ నాయకులు మోతె లింగారెడ్డి, నాయకులు గుండె బద్రి, కందె నర్సయ్య, మాలోతు శంకర్ నాయక్, ఎం. స్వామి చరణ్, రవీందర్,జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్ సర్వీస్ సొసైటీ ఇంటర్నేషనల్ అవార్డుకు ఎంపికైన సోమ శాంత కుమార్




**మహా ముత్తారం జూన్ 8 (జనం సాక్షి)** బెస్ట్ సర్వీస్ సొసైటీ ఇంటర్నేషనల్ అవార్డు – 2026 సంవత్సరమునకు గాను జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ సోమ శాంత కుమార్ ఎంపికైనట్లు జాతీయ అవార్డు కమిటి ప్రకటించారు. సోమవారం అవార్డు సెలెక్షన్ కమిటి నేషనల్ చైర్మన్ మరియు దీప్తా జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ గారు అవార్డు ఆహ్వాన పత్రాన్ని హైదరాబాద్ లోని బహుజన సాహిత్య అకాడమి జాతీయ కార్యాలయములో అందజేశారు. ఈ సంధర్భంగా నల్లా రాధాకృష్ణ మట్లాడుతూ ఎస్.సి. ఎస్.టి. బి.సి. �డ మైనారిటీల సాహిత్యాన్ని ముందుకు తీసుకుపోవడం కోసం బహుజన సాహిత్య అకాడమీ వారు ప్రతి ఏటా ప్రజా ఉద్యమకారులకు, సంఘ సేవకులకు, రచయితలకు, కవులకు మరియు స్వచ్ఛంద సంస్థలకు ఈ అవార్డును అందజేయనున్నట్లు తెలియజేశారు. ఈ సంవత్సరం జులై 12వ తేదిన తెలంగాణలోని హైదరాబాద్ లో నిర్వహించే బహుజన సాహిత్య అదాడమి 19వ నేషనల్ కాన్ఫరెన్స్ సందర్భంగ ఈ అవార్డును అందజేయనున్నట్లు చైర్మన్ సోమ శాంత కుమార్ ఈ విషయాన్ని ఒక ప్రకటనలో తెలియజేశారు. వెస్టర్న్ ఇండియాలోని 5 రాష్ట్రాలైనా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, గోవా మరియు తెలంగాణ, రాష్ట్రాల నుండి సుమారుగా 600మంది డెలిగేట్స్ ఈ కాన్ఫరెన్స్ కి హాజరవుతారని తెలియజేశారు. చైర్మన్ సోమ శాంత కుమార్ ఈ విషయాన్ని ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ అవార్డ్ లెటర్ అందజేసిన వారిలో దీప్తా జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ, తెలంగాణ రాష్ట్ర కో-ఆర్డినేటర్ హనుమాండ్ల విష్ణు, సెక్రెటరీ కనుకుంట్ల విజయ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికంటి ఐలయ్య, అవార్డు సెలక్షన్ కమిటి మెంబర్లు పాల్గొన్నారు.

# నిలిచిపోయిన డ్రైనేజీ, రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించాలి

## సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి



**మహబూబాబాద్, జూన్ 08(జనం సాక్షి):** మహబూబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 33, 34, 35 వార్డుల సభలు ఐఎంఏ హాల్ లో నేడు జరగగా ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ గూగులోత్ జ్యోతి, పాల్గొనగా టిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ పోతరాజు 35వ వార్డు కౌన్సిలర్ గద్దె నీరజారాణి మరియు డి ఇ ఉపేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ 33 వ వార్డు కౌన్సిలర్ బి అజయ్ సారధి రెడ్డి పలు సమస్యలను చైర్ పర్సన్ మరియు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని నిలిచిపోయిన సాయిబాబా గుడి వద్ద డ్రైనేజీ వెంటనే నిర్మించి రోడ్డును తక్షణమే వేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో రాకపోకలకు మరియు భక్తులకు ప్రజా రవాణాకు ఇబ్బందులు ఎదురవుతున్న సందర్భంగా తక్షణమే చర్యలు తీసుకొని డ్రైనేజీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. గత కొన్ని నెలలుగా పెండింగ్ లో ఉన్న వితంతు, వృద్ధాప్య, వికలాంగుల పెన్షన్లు వెంటనే విడుదల చేయాలని అధికారులను ప్రజా ప్రతినిధులను కోరారు. వర్షాకాలం వస్తున్న సందర్భంగా పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రజలు వివిధ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్‌ను నిషేధించడానికి తగిన చర్యలు అధికారులు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వర్షాకాలం నేపథ్యంలో మొక్కలు నాటి భవిష్యత్తు తరాలను ఆదుకోవాలని అధికారులను ప్రజలకు సూచించారు. ముఖ్యంగా 33 వ వార్డులో పెన్షన్ వివిధ సమస్యలు ఉన్న వారి యొక్క వినతి పత్రాలను బి అజయ్ సారధి రెడ్డి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీహరి, వార్డు ఆఫీసర్లు భారత రమేష్, రమ్య, చంద్రిక , వరుణ్, బిల్ కలెక్టర్ శ్రీనివాస్, హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్ మరియు పడిదల కవిత యూసుఫ్ పాల్గొన్నారు.

# స్వర్గీయ మాలహార్ రావు 37వ వర్ధంతి



**మల్హర్, జూన్08(జనంసాక్షి)** మంగళవారం రోజున స్వర్గీయ బెల్లంకొండ మాలహార్ రావు 37వ వర్ధంతి సందర్భంగా మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ కొయ్యూరు గ్రామానికి వస్తున్న నేపథ్యంలో మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాలహార్ రావు అభిమానులు, మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపిటిసిలు, జెడ్పిటిసిలు, ప్రజాప్రతినిధులు, మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షులు జక్కు హర్షిని రాకేష్ హాజరౌతారు అని తెలుపుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలి అని మాజీ జెడ్పిటిసి గోనె శ్రీనివాస రావు పేర్కొన్నారు.

# చెత్త రహిత పట్టణాలే లక్ష్యం

- టీజీపీసీబీ నోడల్ అధికారి శ్రీకాంత్
- మున్సిపల్ సిబ్బందికి ఘన వ్యర్థాల నిర్వహణపై పీపీటీ ద్వారా అవగాహన




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** మున్సిపల్ పరిధిని పర్యావరణహితంగా మార్చడంలో క్షేత్రస్థాయి సిబ్బంది పాత్ర కీలకం. చెత్త రహిత పట్టణాల రూపకల్పనే మన లక్ష్యం అని టీజీపీసీబీ నోడల్ అధికారి ఎ. శ్రీకాంత్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం భూపాలపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఘన వ్యర్థాల నిర్వహణపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి భూపాలపల్లి నోడల్ కార్యాలయం, జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, మున్సిపల్ కమిషనర్, డీఎంహెచ్ఓ ప్రత్యేక సహకారంతో జరిగిన ఈ సదస్సులో మున్సిపల్, స్వచ్ఛ భారత మిషన్‌కు చెందిన 60 మంది కార్మికులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. టీజీపీసీబీ నోడల్ అధికారి శ్రీకాంత్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఘన వ్యర్థాల నిర్వహణ నియమావళి, తడి-పొడి చెత్త వేరు చేయడం, పర్యావరణ పరిరక్షణ చట్టాలపై పూర్తి స్థాయి అవగాహన కల్పించారు. జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ కో-ఆర్డినేటర్ వెంకటేష్ క్షేత్రస్థాయిలో పరిశుభ్రత పాటించడంలో కార్మికుల బాధ్యతలను వివరించారు.

# విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

## ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మొహమ్మద్ యూనుస్



**స్టేషన్ ఘన్పూర్, జూన్ 08 ( జనం సాక్షి ) :** విద్యా హక్కు చట్టాన్ని ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మొహమ్మద్ యూనుస్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం డివిజన్ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ)ను అనేక ప్రైవేట్ పాఠశాలలు ఉల్లంఘిస్తూ, విద్యా సంస్థలుగా కాకుండా వ్యాపార కేంద్రాలుగా మారాయని విమర్శించారు. విద్యార్థులు తప్పనిసరిగా పాఠశా లల నుంచే పుస్తకాలు, యూనిఫాంలు కొనుగోలు చేయాలని ఒత్తిడి తెచ్చి, పేద, మధ్యతరగతి కుటుంబాల పై అదనపు ఆర్థిక భారం మోపుతు న్నారని అన్నారు.సంబంధిత అధికారుల అనుమ తులు లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్య హక్కు చట్టం ప్రకారం బడుగు బలహీన పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు ప్రతి ఒక్క ప్రైవేట్ స్కూల్లో 25 శాతం ఉచిత నిర్బంధ విద్య అందజే యాలని చట్టంలోఉన్నా జిల్లాలో ఏఒక్క పాఠశాల కూడా అమలు చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల భద్రతదృష్ట్యా పాఠశాల బస్సులకు అవసరమైన ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, భద్రతాప్రమాణాలు తప్పనిసరిగా అమలు చేయా లని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటు లోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేకచర్యలు చేపట్టాలనిఅన్నారు.విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను అరికట్టి, విద్యార్థుల హక్కులను కాపాడాలని తెలిపారు.

## కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**సారంగాపూర్,జూన్8(జనం సాక్షి)** నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని యాకర్పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియ, నిల్వలు, రవాణా వ్యవస్థను సమగ్రంగా పరిశీలించారు. ఇప్పటివరకు లారీలు ఎన్ని వెళ్ళాయి? ఏ మిల్లులకు పంపిస్తున్నారు అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కాంటా పూర్తయిందని, మిగిలి ఉన్న ధాన్యం కాంటా పనులను వేగవంతం చేయాలని తెలిపారు.

## ప్రోటోకాల్ పాటించని కమిషనర్

- కాంగ్రెస్ కౌన్సిలర్ వార్డులోనే అభివృద్ధి పనులా?
- మండిపడ్డ బిఆర్ఎస్ నాయకులు డా.రాజారమేష్



**రామకృష్ణాపూర్, జూన్ 08 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా క్యాతనపల్లి మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న వార్డు సభల్లో ప్రొటోకాల్ ప్రకారం చైర్మన్, వైస్ చైర్మన్ ల ఫోటోలు లేకుండా అవమానిస్తున్నారని కమిషనర్ మారుతి ప్రసాద్ ను బిఆర్ఎస్ నాయకులు డా. రాజారమేష్ నిలదిశారు. స్థానిక రాజీవ్ చౌక్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్ సిపిఐ పొత్తులో భాగంగా పాలకవర్గం ఏర్పడినప్పటి నుండి కేవలం కాంగ్రెస్ కౌన్సిలర్లు ఎన్నికైన వార్డుల్లో మాత్రమే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నారని వార్డు ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్న కమిషనర్ ను రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోవాలని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగానే వార్డు సభలు జరిగాలే తప్ప కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వార్డు సభ లాగా నిర్వహించకూడదని ఈ సందర్భంగా కమిషనర్ ను హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 22 వార్డుల్లో వర్షాకాలం రాకముందే మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కంబగోని సుదర్శన్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

## ఏఐసీఎఫ్ సమావేశాలను విజయవంతం చేయాలి



**రామకృష్ణాపూర్, జూన్ 08(జనంసాక్షి):** గోదావరిఖనిలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న ఏఐసీఎఫ్ వర్కింగ్ కమిటీ సమావేశాలను కార్మికులు విజయవంతం చేయాలని బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్. వెంకటస్వామి పిలుపునిచ్చారు. సోమవారం కాసిపేట-1 గనిపై ఆయన ఆధ్వర్యంలో సమావేశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల బొగ్గు పరిశ్రమ క్రమంగా ప్రైవేటు చేతుల్లోకి వెళ్లే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలైన కోల్ ఇండియా, సింగరేణిని నిర్వీర్యం చేసే చర్యలు కొనసాగుతున్నాయని విమర్శించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ పేరుతో లేబర్ కోడ్‌లను అమలు చేస్తూ వేజ్‌బోర్డు ప్రక్రియను ఆలస్యం చేస్తున్నారని అన్నారు. బొగ్గు రంగ పరిరక్షణ కోసం చేపట్టాల్సిన ఉద్యమాలు, పోరాటాలపై సమావేశాల్లో కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. కోల్ ఇండియాలోని అన్ని సంస్థల ముఖ్య నాయకులు సమావేశాలకు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ నెల 14న జరిగే సభకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పిట్ కార్యదర్శి నాగవెల్లి శ్రీధర్, దెబ్బటి శ్రీనివాస్, లింగాల సత్యనారాయణ, జుట్టు అజయ్, గజ్జల సత్యనారాయణ, లవన్ కుమార్, శ్రావణ్ కుమార్, ఎన్. రాజశేఖర్, కె. రాజశేఖర్, ఘంటా శ్రీనివాస్, జి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలి



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 08(జనంసాక్షి ):** జైనూర్ మండలం గౌరి కొలాంగూడ గ్రామప్రజలు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో అన్యాయం జరిగిందని ప్రజా సంఘాల నాయకులు వెలిశాల క్రిష్ణమాచారి సీఐటీయూ జాయింట్ సెక్రెటరీ తో కలిసి జిల్లా కలెక్టరేట్ లో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే సంబంధిత అధికారులు పిలిపించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు న్యాయం జరిగేలా బాధ్యత వహించాలని సూచించారు. సదరు అధికారి ప్రజా సంఘాల నాయకులతో మాట్లాడుతూ లిస్టులో పేర్లు వచ్చిన ఆన్లైన్ లో లేని వారివి చెక్ చేసి చెబుతానని ఆన్లైన్ కానివి వెంటనే గుర్తించి ఆన్లైన్ చేస్తానని అన్నారు. అనంతరం వెలిశాల క్రిష్ణమాచారి మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి అని,రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలి అని అన్నారు. ఇళ్ల మంజూరులో పారదర్శకత పాటించాలి అని,అర్హుల జాబితాను గ్రామ సభల్లో ప్రకటించాలి అని అన్నారు. అనర్హుల పేర్లను తొలగించి అర్హులకు న్యాయం చేయాలి అని,ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి ప్రతి ఒక్కరికి ఇల్లు ఇవ్వాలి అని,ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు వెంటనే విడుదల చేయాలి అని అన్నారు. లబ్ధిదారులకు ఉచిత ఇసుక, నిర్మాణ సామగ్రి అందించాలి అని,పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిశీలించి ఆమోదించాలి అని అన్నారు. దళారుల జోక్యాన్ని అరికట్టి అవినీతి రహితంగా పథకాన్ని అమలు చేయాలి అని అన్నారు. గిరిజనులు, దళితులు, వ్యవసాయ కార్మికులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలి అని అన్నారు. ఇంటి స్థలం లేని వారికి స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేసేలా చూడాలి అని కోరారు. పేదలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని అర్హులైన ఇందిరమ్మ లబ్ధిదారులకు వెంటనే ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీడం భీంభాయ్,సిడం, శాంతిబాయి,ఆత్రం పోచుబాయి,సీడం నాగుబాయి,ఆత్రం లేతుబాయి,ఆయుబాయి, సీడం,సునీత, సీడం గురువంత్, భీమ్రావు, ఆత్రం జంగుబాయి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఉచిత విద్యా వైద్య సేవలు అందించాలి



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 08(జనంసాక్షి ):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యాలయంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజలకు విద్య,వైద్యం అందని ద్రాక్షలా మారుతున్నాయని, ప్రభుత్వాలు విద్యా, వైద్య రంగాలను బలోపేతం చేసి అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం పార్టీగా డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు,ఆసుపత్రుల్లో అవసరమైన సౌకర్యాలు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. ఫలితంగా పేద ప్రజలు ప్రైవేట్ విద్యా సంస్థలు, కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తూ అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు అధిక నిధులు కేటాయించి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ,వైద్య సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలి, గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య, పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం ప్రభుత్వాల బాధ్యత అని అన్నారు. విద్య, వైద్యం హక్కులుగా అమలు చేయాలని, వాటిని వ్యాపార వస్తువులుగా మార్చే విధానాలను విరమించుకోవాలని డిమాండ్ చేసారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని పేదలకు మెరుగైన విద్యా, వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి కూశన రాజన్న పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్, గకుమార్ గోడిసెల కార్తీక్, నాయకులు కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్‌లో మహబూబాబాద్ తాహసిల్దార్‌పై ఫిర్యాదు

**మహబూబాబాద్, జూన్ 08(జనం సాక్షి):** లేని భూమికి పట్టాలు సృష్టించిన వారికి నాలా కన్వర్షన్ ఆర్డర్ కాపీలు ఇచ్చిన మహబూబాబాద్ తహసీల్దార్ పై తెలంగాణ ముస్లిం సంఘాల జే ఏ సి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అహ్మద్ ఖాన్ గ్రీవెన్స్ సెల్ లో కలెక్టర్ కి పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబాబాద్ పట్టణ శివారు ఈదుల పూసపల్లి గ్రామం లో 447 సర్వేనెంబర్ భూమికి ఇటీవల ముగ్గురు వ్యక్తులకు ఒక ఎకరం భూమిలో మహబూబాబాద్ తాహసిల్దార్ అక్కడ భూమి ఉందో లేదో చూడకుండా, సర్వే చేయించకుండా మూడు నాలా కన్వర్షన్ ఆర్డర్ కాపీలు ఇవ్వడం జరిగిందన్నారు.ఐదేళ్ల క్రితం ఇలాగే ఇదే, 447 సర్వే భూమిలో తప్పుడు పద్ధతిలో నాలా ఆర్డర్ కాపీ ని పొంది ప్లాట్లు అమ్ముకున్న భూమికే మహబూబాబాద్ తాహసిల్దార్ మళ్లీ మూడు నాలా ఆర్డర్ కాపీలు జారీ చేశారన్నారు. భూమి ఉందో లేదో చూడకుండా నాలా ఆర్డర్ కాపీలు జారీ చేసిన తాహసిల్దార్, మా కుటుంబానికి చెందిన 448/దీ/3 భూమికి డిలీట్ అయిన డిజిటల్ సంతకం కోసం ఏడాదిగా తిరుగుతున్నా మా భూమి కి డిజిటల్ సంతకంసరి చేయలేదన్నారు.ఇలా ఇబ్బందులకు గురి చేస్తున్న తాహసిల్దార్ పై తగు చర్యలు తీసుకోవాలన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్ మారపాక సుజనా శ్రీనివాస్



**స్టేషన్ ఘన్పూర్, జూన్ 08 ( జనం సాక్షి ) :** మండలంలోని తాటికొండ లో బొల్లం రాజమ్మ మృతి చెందడం జరిగింది.విషయం తెలుసుకున్న సర్పంచ్ మారపాక సుజనా శ్రీనివాస్,ఉపసర్పంచ్ కట్టమల్లు సోమవారం రాజమ్మ పార్థివాదేహానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. అనంత రం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ సుజనా శ్రీనివాస్ తో పాటు వార్డ్ సభ్యులు బొల్లం నాగరాజు, నలిమెల కోమలత ఏలియా, జీపీ సిబ్బంది రచ్చ శ్రీనివాస్, అరాఫత్, నాయకులు పులిగిల్ల రాజయ్య, బొప్పే చెంబయ్య, పులి రవి,తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బొల్లం రాజమ్మ పార్థివా దేహానికి బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పొన్నం శ్రీనివాస్, సీనియర్ నాయకులు మారపాక కవిత మనోహర్ పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు పెరబోయిన కుమార్, మారపాక అశోక్, నీల మధు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు అక్కెనపల్లి వెంకన్న, అక్కె నపల్లి రాజు, బండ సంపత్, మారపాక నాగరాజు (ఎంఎన్ఆర్), ఉబ్బని రాజు తదితరులు పాల్గొన్నారు.

# పిచ్చి మొక్కలను తొలగించండి సారూ..



**ఖానాపూర్ జూన్ 08 (జనం సాక్షి)** మునిసిపాలిటీ కేంద్రంలోని ప్రధాన దారి పొడవున ఉన్న డివైడర్ మధ్యలో మొలకెత్తిన పిచ్చి మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. మునిసిపాలిటీ సిబ్బంది మొక్కల నిర్వహణపై దృష్టి సారించకపోవడం వలన పిచ్చి మొక్కలు మొలకెత్తుతున్నాయనిప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికైనా మునిసిపాలిటీ అధికారులు స్పందించి డివైడర్ల మధ్యన మొలకెత్తిన ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

# ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ

### వికలాంగుడైన వెంకగారి గంగన్నకు మజ్జిగ అందించిన ఎంపీఓ గోవర్ధన్



**దిలావర్పూర్, జూన్ 8, (జనం సాక్షి):** దిలావర్ పూర్ మండలంలోని న్యూ లోలం గ్రామంలో గ్రామ సర్పంచ్ శ్రీలత , ఎంపీడీవో అరుణ రాణి, ఎంపీఓ గోవర్ధన్ లు ఉపాధి హామీ కూలీలకు పనిచేస్తున్న ప్రదేశాన్ని సందర్శించి, అక్కడ పని చేస్తున్న కులీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అరుణరాణి మాట్లాడుతూ... ఎండ తీవ్రత ఎక్కువ ఉండడం వల్ల కూలీలు ఉదయాన్నే పనికి రావాలని, ఎండలు తీవ్రత ఎక్కువ అవ్వక ముందే ఇల్లు చేరుకోవచ్చని, పనులు చేసే సమయంలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మంచినీరు ఎక్కువ తీసుకోవాలని, తరచు చల్ల మజ్జిగ సేవించాలని సూచించారు. ఉపాధి హామీ పనిలో ఉన్న అదే గ్రామానికి చెందిన వికలాంగుడైన వెంకగారి గంగన్నకు ఎంపీఓ గోవర్ధన్ మజ్జిగ అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో దివ్య రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అరుణ, టి ఏ వెంకటరమణ, ఎస్ఏ మహేష్ , మంద మల్లేష్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# సర్కార్ బడి - అమ్మ ఒడి

### తన పిల్లలతో ప్రభుత్వ బడి బాట పట్టిన గురువు




**నూగూర్ వెంకటాపురం జూన్ 8 (జనం సాక్షి ):-** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ పాఠశాల ఎంపీపి ఎస్ మరికాల కొత్తూరు,లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కాపుల విజయ్ అనే ఉపాధ్యాయుడు తమ కుమారులని అదే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ విద్యపై ఉన్న విశ్వాసాన్ని చాటి చెప్పారు. ప్రభుత్వ విద్య పైన నమ్మకానికి తన పిల్లలతోనే ప్రభుత్వ బడి బాట పట్టిన గురువునిదర్శనం గా నిలిచారు. సర్కార్ బడి పైన విశ్వాసం, తనయుల అడ్మిషన్ తో చాటిన ఉపాద్యాయుడు ఈ సందర్భంగా మరికాల ఎంపీ పి ఎస్ ఉపాద్యాయుడు మాట్లాడుతూ.."ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు,ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయనిఅన్నారు.అందుకే నా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాను" అని ఆయన తెలిపారు.ఈ నిర్ణయం పలువురు తల్లిదండ్రులకు ఆదర్శంగా నిలుస్తూ, ప్రభుత్వ పాఠశాల విద్యపై ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంచాలని ఆయనవిజ్ఞప్తి చేశారు .

# కరపత్రాలను ఆవిష్కరిస్తున్న హిందూ ధర్మ సమ్మేళన సమితి బాధ్యులు

- ఈనెల 11న హిందూ ధర్మ సమ్మేళనం కార్యక్రమం
- గోడపత్రికల ఆవిష్కరణ



**చెన్నారావుపేట, జూన్ 8 ( జనం సాక్షి):** ఈనెల 11వ తేదీన గురువారం హిందూ ధర్మ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెన్నారావుపేట హిందూ ధర్మ సమ్మేళన సమితి అధ్యక్షులు కంది గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వరంగంటి కుమారస్వామిలు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీ సిద్దేశ్వర ఆలయం ఆవరణలో హిందూ ధర్మ సమ్మేళన సమితి చెన్నారావుపేట కమిటీ ఆధ్వర్యంలో హిందూ ధర్మ సమ్మేళనం గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11వ తేదీన సాయంత్రం 6 గంటలకు శ్రీ సిద్దేశ్వర ఆలయం ఆవరణలో హిందూ ధర్మ సమ్మేళనం కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఆత్మీయ హిందూ బంధువులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదక్షులు ఈగ సత్యనారాయణ, చందుల కృష్ణమూర్తి, సమన్వయకర్తలు మోతె సమ్మిరెడ్డి, పూలబోయిన మురళీధర్, నిర్వహణ కార్యదర్శులు తోట ఆనందం, ఎదురబోయిన వీరేంద్రనాథ్, కోశాధికారి పర్శ కిరణ్ కుమార్, కవి ములుక సాంబయ్య, వరంగంటి మల్లయ్య, తాళ్లపెల్లి కొమ్మాలు, గట్ల కృష్ణయ్య, ములుక ఐలయ్య, ముత్యం సాంబయ్య, కుసుమ నరేందర్, వనపర్తి చేరాలు, చెవ్వ వెంకటేశ్వర్లు, చాపర్తి రాజు, బొంత సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు



**నల్లబెల్లి, 08(జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు ఉన్నాయని సర్పంచ్ ఎరుకల లలిత రఘు అన్నారు. మండలంలోని పంతులు పల్లె గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులతో కలిసి సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను పంపించాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం లలిత మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య అందుతుందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్య బోధన చేయబడుతుందన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ లను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కర్ణ కంటి రామ్మూర్తి,ఏఏపీసీ చైర్మన్ ఎరుకల వెంకటలక్ష్మి, మద్ది మేడారం ట్రస్ట్ చైర్మన్ పబ్బు రాజేష్ గౌడ్, గ్రామ పెద్దలు నాగరాజు, జనార్ధన్, ఆదిరెడ్డి, ఉపాధ్యాయులు కునమల్ల రాజన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# మన ఊరు బడి మన పిల్లల బంగారు భవిష్యత్తుకు పునాది

### బడిబాట కరపత్ర ఆవిష్కరణ చేసిన సర్పంచ్ బండి రేణుక శంకర్



**నడి కూడ జూన్ 8 (జనం సాక్షి) :** నడికూడ మండలం చర్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గ్రామ సర్పంచ్ బండి రేణుక శంకర్ బడిబాట కరపత్ర ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండి రేణుక శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య, గుణాత్మక విద్య అందుతుందని, పాఠశాలలో మంచి అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం ఉన్నదని, ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం ఉంటుందని,ఈ విద్యా సంవత్సరము నుండి పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభమైన అని, నాలుగు సంవత్సరాలు నిండినటువంటి పిల్లలను మన ప్రభుత్వ పాఠశాలల్లోనే ఇక నుండి చేర్పించవచ్చని ఈ సందర్భంగా తల్లిదండ్రులను కోరారు. మన ఊరిలో ప్రభుత్వ బడి ఉండగా ప్రైవేట్ ప్రైవేట్ బడులకు పంపడం ఎందుకని, మన ఊరు బడి మన పిల్లల బంగారు భవిష్యత్తు అని, నేడు మీ పిల్లలను చేర్పించండి రేపటి భవిష్యత్తును నిర్మించండి అని తల్లి దండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ ఉపాధ్యాయులు పుల్లూరి రామకృష్ణ, తల్లిదండ్రులు చిరంజీవి , సుధ,పాల్గొన్నారు.

# ప్రారంభ సమయం సమీపిస్తున్నా... పట్టింపుకరు..!




**ఖానాపూర్ జూన్ 08 (జనం సాక్షి)** ఇటీవల వీచిన ఈదురు గాలులకు మండలంలోని మస్కాపూర్ కేజీబీవీ పాఠశాల ప్రహరీ పై చెట్టు పడి ధ్వంసం అయింది. దంసమైన ప్రహరీ గోడను పట్టించుకునే వారే లేరని స్థానికంగా చర్చలు జరుగుతున్నాయి. బాలికల పాఠశాల, కళాశాల కావడంతో ప్రహరీ తప్పనిసరిగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది. అలాంటి స్థితిలో పాఠశాల నిర్వహణ కఠినంగా ఉన్నప్పటికీ ప్రహరీ పడిపోయినా పట్టించుకోవడంలేదని పాఠశాల ఆరంభ సమయం సమీపిస్తున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు ఇప్పటివరకు స్పందించిన దాఖలాలు లేవని స్థానికంగా చర్చలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణం చేపట్టాలని పరువులు కోరుతున్నారు. ఇప్పటికైనా సమేత శాఖ అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణం పై దృష్టి సారించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# గుంజేడు ముసలమ్మ ఆలయంలో బహిరంగ వేలం పాట



**కొత్తగూడ జూన్ 8(జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుంజేడు గ్రామంలో వెలిసిన ముసలమ్మ ఆలయంలో నిర్వహించే 2026-27 సంవత్సరమునకు షెడ్యూల్లో చూపిన ప్రకారముగా సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలము ఈ నెల 11 గురువారం ఉదయం 11-30 నుండి 12గం.ల కు శ్రీ ముసలమ్మ జాతర గుంజేడు దేవస్థానం లో బహిరంగ వేలము నిర్వహించబడునని ఆలయ నిర్వహణ అధికారి అనిల్ కుమార్ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.ఆలయ ప్రాంగణంలో కొబ్బరికాయలు, ఫోటోలు, పూజసామాను,తలనీలాల సేకరణ హక్కు లైసెన్సు కొరకు వేలములో పాల్గొనదలచిన వారు ఈ నెల 8 నుండి 11 తేదీ 11 గంటల వరకు దేవస్థానము వద్ద టెండర్ ఫారము కొరకు రూ.500 చెల్లించి రశీదు పొందాలని అన్నారు.ఈ నెల 11 (గురువారం ) ఉదయం 11-30 గం.ల నుండి మధ్యాహ్నము 12-00 గం.ల వరకు దేవస్థానము వద్ద సీలు వేసిన బాక్స్ ద్వారా షెడ్యూల్స్ స్వీకరించబడును అని అన్నారు.తదుపరి వచ్చిన షెడ్యూల్స్ స్వీకరించ బడవని తెలియజేశారు.

## ఖరీఫ్ ఖాతా భూమిని రిజిస్ట్రేషన్ చేసిన రెవెన్యూ అధికారులు

### ఆన్లైన్లో పట్టాగా చూపుతున్న సర్వే నెంబర్ 75

**భీమిని జూన్ 8 జనం సాక్షి** భీమిని మండలం కేస్లాపూర్ గ్రామం కేసులాపూర్ శివారు లోని 75 సర్వే నెంబర్ లో ఆరు ఎకరాల 18 భూమి ఖస్రా ఖరీజ్ ఖాతా చూపిస్తుండగా ధరణిలో మాత్రం పట్టా భూమిగా చూపుతోంది. సర్వే నంబర్75 లోని భూమిని గత ఎనిమిది రోజుల క్రితం రిజిస్ట్రేషన్ జరిగినట్లు సర్పంచ్ పోతురాజుల సతీష్ ఆరోపిస్తున్నాడు. గతంలో ఈ భూమిని సాదా బైనవపై నేను నాగపురి భూమక్క వద్ద కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి కార్యాలయానికి వెళ్తే ఇది ఖరీజు ఖాతా భూమి రిజిస్ట్రేషన్ కాదని చెప్పిన రెవెన్యూ అధికారులు గుట్టు చప్పుడు కాకుండా వారం రోజుల క్రితం రిజిస్ట్రేషన్ చేయడం ఎంతవరకు సమంజసం అని ఒక ప్రకటనలో అన్నారు. అప్పుడు కాలేజీ కాక గా ఉన్న భూమి ఇప్పుడు పట్టాగా ఎలా మారిందో రెవెన్యూ అధికారులు చెప్పాలని దీనిపై జిల్లా కలెక్టర్ కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. మీ రిజిస్ట్రేషన్ పై రెవెన్యూ ఉన్నతాధికారులు విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

## కుబీర్ విఠలేశ్వర ఆలయ నూతన కమిటీ ఎన్నిక

### అధ్యక్షుడిగా సూర్యకాంత్



**కుబీర్, జూన్ 08, (జనంసాక్షి):** మండల కేంద్రమైన కుబీర్లోని పురాతన శ్రీ విఠలేశ్వర స్వామి ఆలయ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ అభివృద్ధి, ధార్మిక కార్యక్రమాల నిర్వహణే ప్రధాన లక్ష్యంగా ఈ కమిటీని ఏర్పాటు చేశారు. ఆలయ నూతన కమిటీ అధ్యక్షుడిగా నీలేవార్ సూర్యకాంత్, ప్రధాన కార్యదర్శి (సెక్రటరీ)గా రెడ్డిశెట్టి నిఖిల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శతాబ్దాల చరిత్ర కలిగిన విఠలేశ్వర ఆలయ వైభవాన్ని కాపాడుతూ, భక్తులకు అవసరమైన మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. ఆలయంలో నిత్య ధూపదీప నైవేద్యాలతో పాటు, పండుగలు, విశేష పర్వదినాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి గ్రామస్థులు శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆలయ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కోరారు.

## ఈ నెల 10న,వాహనాల వేలం

**గూడూరు,జూన్08(జనంసాక్షి):** వివిధ కేసులల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 10న బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ బిక్షపతి తెలిపారు.సోమవారం గూడూరు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా ఎక్సైజ్ అధికారి కిరణ్ సమక్షంలో బహిరంగ వేలం బుధవారం నిర్వహించబడుతుందని, గూడూరు ఎక్సైజ్ స్టేషన్లో వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలు. నల్లబెల్లం,నాటు సారాయి రవాణా కేసులలో పట్టుబడినటువంటి రెండు ఆటోలు,40 ద్విచక్ర వాహనాలు ఉన్నాయని,వేలంలో పాల్గొనే వారు వాహనాలను చూసి,బహిరంగ వేలంలో పాల్గొనగలరు.వాహనాల వేలం ధరలో సగం రూపాయలను ఈఎండి గా, ఒక్కొక్క వాహనానికి విడివిడిగా బుధవారం ఉదయం 10 గంటల లోపు చెల్లించి వేలంలో పాల్గొనాల్సిందిగా తెలిపారు.

## పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ



**పర్వతగిరి జూన్ 9: (జనం సాక్షి)** పర్వతగిరి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందించినట్లు పర్వతగిరి మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి తెలిపారు. పర్వతగిరి మండల విద్యా వనరుల కేంద్రంలో ఈరోజు నిర్వహించిన ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొనీ పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల ప్రారంభ తేదీకి ముందే అన్ని పాఠశాలలో పాఠ్య పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, యూనిఫామ్ మరియు మధ్యాహ్న భోజనం అందిస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించవలసిందిగా విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని పాఠశాలల హెడ్మాస్టర్లు మరియు ఎంఆర్సి సిబ్బంది శిల్ప జయరాజ్ సీ ఆర్ పి లు ప్రవీణ్ సుధా శ్రీనివాస్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్‌కి గ్రామ సభలో అరుదైన గౌరవం



**తాండూర్, జూన్ 08( జనం సాక్షి)** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా జరుగుతున్న గ్రామ సభలో మాదారం గ్రామపంచాయతీ లో ఏజెండ లోని అంశాలు చర్చించుకున్న తర్వాత ఇటీవలి కాలంలో అంగన్వాడీ టీచర్ గా విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన కల్వకోలను అనసూయ గారి గౌరవంగా ముఖ్య అతిథులుగా డిసిసి ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి మరియు ఎంపిడిఓ శ్రీనివాస్, డి.ఈ మల్లయ్య సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్, సూరం రవీందర్ రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడి టీచర్లు చిన్న పిల్లలకు,గర్భిణులకు తల్లి లాంటి పాత్ర పోషిస్తున్నారని, అలాంటి వారిని సన్మానించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ తో పాటు డిసిసి ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి, ఎంపిడిఓ శ్రీనివాస్ ,డి, ఈ మల్లయ్య,ఏ, ఈ మనోహర్, , ఏ.ఎస్.ఐ , ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి,మరియు గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు బానేష్,లలిత,సౌమ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి అల్లావుద్దీన్, సురేందర్ , కాంగ్రెస్ నాయకులు మీస శంకర్, జోరిగల రమేష్, శ్రీనివాస్, క్రిష్ణ, కమలాకర్, కోమల, సుభాకర్ డీలర్ శంకరయ్య సిపిఐ నాయకులు శంకర్ మరియు ఆశా వర్కర్లు ,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**తాండూర్, జూన్ 08( జనం సాక్షి)** ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారన్న ఆదేశాల మేరకు ప్రజావాణి కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ( గ్రీవెన్స్ ఇంచార్జ ) మరియు తాండూర్ ఎంపీడీవో కి ఆటో కార్మికుల సమస్యలపై ప్రధానమైన పది డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తాండూర్ మండల్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్ పాషా అధ్యక్షతన వినతి పత్రం ఇచ్చారు, గ్రీవెన్స్ ఆఫీసర్ మరియు ఎంపీడీవో సానుకూలంగా స్పందించి మీ సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మా వంతుగా కృషి చేస్తామని ఎంపీడీవో చెప్పారు, ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ 2023 ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఏదైతే వాగ్దానం చేశారు వీలైనంత తొందరగా మా ప్రధాన డిమాండ్ లైనా సంక్షేమ బోర్డు పన్నెండు వేల రూపాయలు గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ఐదు లక్షల ప్రమాద బీమా ఇన్వాల్వ్ చేయాలి వెంటనే మంజూరు చేయాలని మిగతా 8 డిమాండ్లు చర్చలు జరిపి రైతుబంధు ఇలాగే తీస్తున్నారు ఆటో బంద్ పథకం కింద 5 లక్షలు ఇవ్వాలి ప్రతి పట్టణ కేంద్రంలో మండల కేంద్రంలో ఒక ఎకరం స్థలంతో ఆటో భవనం నిర్మించి ఇవ్వాలి సత్వరమే పరిష్కరించాలని గౌరవనీయుల ముఖ్యమంత్రివర్యులు శ్రీ ప్రైవేట్ ఫైనాన్సర్లు ఆగడాలు కట్టించడానికి చట్టాలు నియంత్రించి కొత్త జీవోలు తీసుకురావాలి సింగరేణి ఆర్టీసీ కార్మికులకు ఎలాగైతే కోటి 50 లక్షల ఇన్సూరెన్స్ ప్రభుత్వం పంజాబ్ నేషనల్ బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఇస్తుందని చెప్తున్నారు అలాగే ఆటో కార్మికులకు కూడా ఇవ్వాలి పోలో ఉబర్ రాపిడోలు రద్దు చేయాలి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భారత్ యాప్ను గుజరాతి కాకుండా భారత దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు వర్తింపచేయాలి పెరిగిన డీజిల్ సిఎన్జి గ్యాస్ ధరలు వెంటనే నియంత్రించాలి లేదా ఆటో డ్రైవర్లకు ఆర్టీసీ వాళ్ళకి సింగరేణి వాళ్ళకి ఎలాగైతే సబ్సిడీ ఇస్తున్నారో అలా సబ్సిడీ ఇవ్వాలి దయచేసి ఆటో కార్మికుల గోడును అర్థం చేసుకొని గౌరవనీయులు ముఖ్యమంత్రివర్యులు ఏను మల రేవంత్ రెడ్డి ని మా బతుకులు దయనీయమైన పరిస్థితిలో ఉన్నాయి కాబట్టి మా ఆటో కార్మికుల పట్ల దృష్టి సారించి సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో వి ఆర్ టి యు మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ హబీబ్ పాషా వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నం శ్రీనివాస్ మండల సలహాదారులు బండి చందు సోషల్ కోశాధికారి రఫీ ఖాన్ మీడియా ఇంచార్జ్ పుప్పాల శ్రీకాంత్ ప్రచార కార్యదర్శి పోచం రేపల్లె వాడ కుమార్ ఏం దుర్గయ్య షన్ను రంగయ్య మొండి గురుమూర్తి రాజన్న మొహమ్మద్ అజార్ నవీన్ మాదారం త్రీ వినోద్ శ్రీకాంత్ ఎం వి కె త్రీ తాండూర్ బస్టాండ్ శీను తోట సంతోష్ పెద్ద పోయిన భీమేష్ కస్తూరి తిరుపతి తంగళ్ళపల్లి నవీన్ వాళ్ళ తండ్రి నరసాపూర్ కొత్త శంకర్ కాటంరాజు తాళ్లపల్లి విజయ్ బెల్లంపల్లి పాత బస్టాండ్ ఐపీ అడ్డా ఆటో కార్మికుడు రాగి సత్తి కొమరం భీం జిల్లా బిర్యాని ఆటో కార్మికులు అచలాపూర్ రేష్మి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన దర్బార్‌లో సమర్పించిన దరఖాస్తులకు సత్వరమే పరిష్కరించాలి

### ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ లెనిన్ వత్సల్ టోప్పో



**ఏటూరునాగారం,జూన్ 08(జనంసాక్షి).** సోమవారం సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ లో గిరిజనుల నుండి వచ్చిన వినతులను స్వయంగా స్వీకరించి సమస్యలను త్వరీతగతిన పరిష్కారం చూపాలని సంబంధిత సెక్టార్ అధికారులకి ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి లెనిన్ వత్సల్ టోప్పో ఆదేశించినారు. ఈ గిరిజన దర్బార్ లో వివిధ మండలాల నుండి వచ్చిన గిరిజనులు (27) దరఖాస్తులు ప్రాజెక్టు అధికారికి స్వయంగా గిరిజనులు సమర్పించారు.ఈ కార్యక్రమంలో జి ప్రతాప్ ఎస్డీసి టి డబ్ల్యూ, వీరబద్రం ఈఈ టిడబ్ల్యూ, ఏ అనిల్ కుమార్ డిప్యూటి తహసిల్దార్ (ఎస్డీసి), కె క్రాంతి కుమార్ డిప్యూటి డిఎంహెచ్వో ఐటిడిఏ,కె వాని డిఏమ్ జిసిసి, ఎం కొండలరావు జెడిఎమ్,ఏ కిషోర్ జియాలజిస్ట్, కె ప్రభాకర్ పేసా కో ఆర్డినేటర్, ఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రిన్సిపాల్ ఆర్ఐటిఐ, ఎల్ శంకర్ టిఎస్ ఆర్టీసి మేనేజర్ మరియు సంబందిత అధికారులు గ్రీవెన్స్ సెల్‌లో పాల్గొన్నారు.

## మర్రిపల్లికి బస్సు సర్వీస్ పునరుద్ధరణ...



**వరంగల్ ప్రతినిధి, జూన్ 8 (జనం సాక్షి):** నర్సంపేట డిపో నుండి బస్సు సర్వీసును మర్రిపల్లి వరకు ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల సౌకర్యార్థం సోమవారం ప్రారంభించారు. నర్సంపేట డిపో నుండి తిమ్మంపేట,మహ్మదాపురం మీదుగా మర్రిపల్లి గ్రామం వరకు బస్ సర్వీస్ నడపడానికి స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రత్యేకచొరవతో బస్సు సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని మర్రిపల్లి,మహ్మదాపురం సర్పంచ్ లు డ్యాగం సుజాత సుధాకర్,గోగుల శ్రీనివాస్ రెడ్డి ప్రారంభం కార్యక్రమంలో పాల్గొని ప్రారంభించినారు,ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డె కృష్ణంరాజు, కుంట రాజుకుమార్,ఉప సర్పంచులు ఎద్దు పద్మ రాజు,బోయిని రంజిత్,వార్డు మెంబర్లు కామ సోమ లక్ష్మి, డ్యాగం రాణి,ఎరుకల పద్మ, పాలడుగుల శ్రావణ్,గాజు శివాజీ, కుక్కముడి రాజేందర్, వివో అధ్యక్షురాలు ఇనుముల సరిత వేల్పుల సుజాత,మాజీ ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

# నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ
- ఈ నెల 21న 388 మంది అభ్యర్థులకు పరీక్ష



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): ఈ నెల 21న జరిగే నీట్ ప్రవేశ పరీక్షను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి అని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నీట్ పరీక్ష నిర్వహణపై రెవెన్యూ, పోలీసు, వైద్య, మున్సిపల్, అగ్నిమాపక, విద్యుత్, పోస్టల్ శాఖలతో పాటు పరీక్షా కేంద్రాల సీఎస్‌లతో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొత్తం 388 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5:15 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, అభ్యర్థులను ఉదయం 11 నుండి మధ్యాహ్నం 1:30 వరకు అనుమతిస్తారని చెప్పారు. నీట్ చాలా ప్రతిష్ఠాత్మకమైన పరీక్ష. గత అనుభవం, భద్రతా అంశాలు, ఇంటెలిజెన్స్ నివేదికలు పరిగణనలోకి తీసుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులపై నిఘా, సీసీటీవీల ఏర్పాటు, ప్రశ్నపత్రాల రవాణాకు కట్టుదిట్టమైన పోలీస్ భద్రత ఉండాలి అని సూచించారు. పరీక్ష రోజున కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, అభ్యర్థులకు రవాణా సౌకర్యాలు కల్పించాలని పోలీస్ శాఖను ఆదేశించారు. ఈ నెల 20న మాక్ డ్రిల్ నిర్వహించాలని, పరీక్ష రోజు బీఎన్ఎస్ 163 అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి కేంద్రంలో అత్యవసర చికిత్స కేంద్రం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య సిబ్బంది, అంబులెన్స్ ఏర్పాటు చేయాలని వైద్య శాఖకు సూచించారు. కేంద్రాల సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను తాత్కాలికంగా మూసివేయాలని, ఉదయం 9-1, సాయంత్రం 5-7 గంటల మధ్య అదనపు బస్సులు నడపాలని ఆర్టీసీకి చెప్పారు. నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖలను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ వసంత కుమారి, డీఎంహెచ్ఓ డా. మధుసూదన్, ఏఓ శ్రీనివాసులు, నీట్ సిటీ కోఆర్డినేటర్ రమణ రావు, సెంటర్ సూపరింటెండెంట్లు శ్రీధర్, బాలు నాయక్, విద్యుత్ ఏఈ విశ్వాస్ రెడ్డి, ఆర్టీసీ ట్రాఫిక్ ఇంచార్జి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లో చేరని కార్యదర్శి

- మెమో జారీ చేసిన ఎంపీడీవో వెంకట సాయి శివానంద్



చెన్నారావుపేట, జూన్ 8 ( జనం సాక్షి): పంచాయతీ అధికారుల ఆదేశాలను గొల్లభామ తండా పంచాయతీ కార్యదర్శి సంతోష్ బేఖాతర్ చేస్తూ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాడు. మండలంలోని బాపునగర్ పంచాయతీ కార్యదర్శి గా పనిచేస్తున్న రవి డిప్యూటేషన్ పై అమృతండా గ్రామానికి బదిలీ అయ్యాడు. బాపునగర్ స్థానం ఖాళీ అవడంతో జిల్లా పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో వెంకట సాయి శివానంద్ గొల్లభామ తండా పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సంతోష్ కు బాపునగర్ గ్రామపంచాయతీ ఇన్చార్జి కార్యదర్శి బాధ్యతలను అప్పగించారు. ఈనెల 4వ తేదీన ఉత్తర్వులు సైతం జారీ చేశారు. కానీ పంచాయతీ కార్యదర్శి సంతోష్ ఇప్పటివరకు బాపునగర్ గ్రామానికి వెళ్లి పంచాయతీ కార్యదర్శి బాధ్యతలను తీసుకోలేదు. పంచాయతీ కార్యదర్శి సంతోష్ కు మెమో జారీ చేసినట్లు ఎంపీడీవో వెంకట సాయి శివానంద్ సోమవారం తెలిపారు.

## ములుగు మున్సిపాలిటీలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'



ములుగు ప్రతినిధి, జూన్ 08 (జనంసాక్షి) : 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రజా పాలన – – ప్రగతి ప్రణాళిక లో భాగంగా, ములుగు మునిసిపాలిటీలోని వివిధ వార్డుల్లో వార్డు సభలను నిర్వహించింది. 14వ వార్డులో జరిగిన వార్డు సభ సమావేశంలో మునిసిపల్ చైర్పర్సన్, వైస్ చైర్పర్సన్, కమిషనర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారి ములుగు మునిసిపాలిటీతో సమన్వయంతో ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2026 గురించి వివరించారు. ఇందులో మూలం వద్ద వ్యర్థాల వేరుచేయడం, 4-రకాల వేరుచేయడం, ఇంటి స్థాయిలో తడి వ్యర్థాల కంపోస్టింగ్, మరియు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ (ఉన్మూలం)కు పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాల వినియోగం వంటి అంశాలు ఉన్నాయి. ఈ వార్డు సభలో రెవెన్యూ శాఖ అధికారి, ఇతర శాఖల అధికారులు, వివిధ సంఘాలు, మునిసిపల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## హనుమకొండ డిఎంహెచ్వో గా డాక్టర్ ఎస్ దుర్గా రామ్ కుమార్



హనుమకొండ ప్రతినిధి (జనంసాక్షి) : వైద్య ఆరోగ్యశాఖ బదిలీల్లో భాగంగా హనుమకొండ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ ఎస్ దుర్గా రాంకుమార్ ని నియమించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ ని కలిసి రిపోర్ట్ చేయడం జరిగింది. వీరు కూకట్పల్లి జోన్ డిఎంహెచ్వో గా పని చేస్తూ బదిలీపై హనుమకొండకు రావడం జరిగింది.ప్రస్తుతం హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పనిచేస్తున్న డాక్టర్ అల్లం అప్పయ్య ని ములుగు జనరల్ ఆస్పత్రి ఆర్ఎంఓ గా నియమించడం జరిగింది. అదనపు కలెక్టర్ శ్రీ ఎన్ రవి ,డి ఆర్ ఓ శ్రీ శ్రీనివాస్ లను మర్యాద పూర్వకంగా కలవడం జరిగిందిడిప్యూటీ సివిల్ సర్జన్ లుగా డాక్టర్ సిహెచ్ మురళి మరియు డాక్టర్ పవిత్ర లు జిల్లాకు బదిలీపై రావడం జరిగింది.

## రోడ్డు తవ్వారు.. మరిచారు



ఎల్కతుర్తి (జనంసాక్షి) : మండల కేంద్రములో ప్రధాన రహదారి పక్కన ఉన్న దామెర చింతపల్లి తో పాటు కాజీపేట నుండి హన్మకొండ నుండి కాజీపేట కు నిత్యం ప్రయాణికులతో బస్సుల్లో ఆటోలలో ప్రయాణం చేస్తూ గత ఏదాది నుండి ప్రయాణికులు కష్టం ఎల్లబోసుకుంటూ వెళుతూ మళ్ళీ వర్ష కాలము రాగానే ప్రయాణికులకు కష్టాలు మొదలైనట్లు ప్రయాణికులు తెలుపుతున్నారు ఉదయం నుండి రాత్రి వరకూ ప్రజలు నిత్యం ప్రయాణిస్తూ స్థానిక ఎస్బిఐ దగ్గర ఇటీవల రోడ్డు మరమ్మతులు చెయ్యగ కొంచెం లోతుగా తీసి పనులను కాంట్రాక్టర్ ఆపివేయడం తో ప్రయాణికులు ఖంగు తిన్నారు ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ దామెర రోడ్డు లో మరమ్మత్తుల పేరుతో దోపిడి గురిచేస్తూ ప్రయాణికులను ఇబ్బందికి గురి చేస్తూ నరకయాతన పడుచున్నామని దామెర నుండి ఎలుకతుర్తి సమీపంలో రోడ్డు బాగా లేనందున తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని దాదాపు 150 మీటర్ల వరకు రోడ్డు ను లోతుగా తీసి ఎందుకు ఆపారో తెలియడంలేదని సంబంధిత అధికారులు వెంటనే రోడ్డు మరమ్మ తులను వెంటనే ఏర్పాటు చేసి ప్రయాణాన్ని సవ్యంగా జరగాలని సంబంధిత అధికారులను మీడియా ద్వారా వివరించడం జరిగింది అధికారులు తక్షణమే మరమతులను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా అన్నారు

## ఈవీఎం గోదాం త్రైమాసిక తనిఖీ



ములుగు ప్రతినిధి, జూన్ 08(జనంసాక్షి) : ఈవీఎం గోదాం ను జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. సోమవారం జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ ను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు జారీ చేశారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎండి సలీం, డిప్యూటీ తహసీల్దార్ నితీష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ మనోహర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బీటి రోడ్డు వేయించి మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

కృతజ్ఞతలు తెలిపిన కాంగ్రెస్ నాయకుడు వక్కల రాజు





స్టేషన్ ఘన్పూర్, జూన్ 08 ( జనం సాక్షి ) : మండల కేంద్రంలోని జాతీయ రహ దారి నుండి కొత్త పెల్లి మీదుగా తాటికొండ వరకు ఇచ్చిన హామీ మేరకు మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీటీ రోడ్డువేయించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాడని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు వక్కల రాజు తెలిపారు.ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఏ కడియం శ్రీహరి గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు స్టేషన్ఘన్పూర్ నుండి కొత్తపెల్లి మీదుగా తాటికొండ వరకు బీటి రోడ్డు వేయించడం జరిగిం దని అన్నారు. రోడ్డు వేయించిన కడియం శ్రీహరి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అదేవిధంగా స్టేషన్ గణపురం క్రాస్ నుండి తాటికొండ వరకు డబల్ రోడ్డు వేయించడానికి ఎంతో కృషిచేసిన ఎంఎల్ఏ కడియం శ్రీహరి కి, ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు తాటికొండ సర్దార్ సర్వాయి పాపన్న ఆటో యూని యన్ తరపు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పల్స్ పోలియో, స్టాప్ డయేరియా, జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాలను విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు



ములుగు ప్రతినిధి, జూన్ 08(జనంసాక్షి) : పోలియో నిర్మూలన,చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు చేపడుతున్న పల్స్ పోలియో, స్టాప్ డయేరియా క్యాంపెయిన్, జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పల్స్ పోలియో, స్టాప్ డయేరియా క్యాంపెయిన్, జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాలపై జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 0-5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని అన్నారు. వలస కార్మికులు నివసించే ప్రాంతాలు, ఇటుక బట్టీలు, నిర్మాణ పనుల ప్రాంతాలు వంటి అధిక ప్రమాద ప్రాంతాలను గుర్తించి అక్కడి పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని సూచించారు. వర్షాకాలంలో ప్రబలే డయేరియా వ్యాధి నివారణకు గ్రామీణ స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

## జీతాల్లేని జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలి

సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా కు టి డబ్ల్యు జే ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వడ్నాల వెంకన్న వినతి.



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 08(జనంసాక్షి ): ఎలాంటి వేతనాలు లేకుండా, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా నిలిచి అహర్నిశలు శ్రమిస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు వడ్నాల వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ఐఏఎస్ కు యూనియన్ నాయకులతో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 80 శాతం మంది జర్నలిస్టులు ఎలాంటి నెలవారీ జీతాలు లేక, నిత్యావసరాల ధరలు పెరిగి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం కోసం నిరంతరం తపించే జర్నలిస్టులు ప్రజాస్వామ్యంలో నాలుగవ స్తంభం అయినప్పటికీ కార్పొరేట్ విద్యాసంస్థల్లో వేలాది రూపాయల ఫీజులు చెల్లించలేక తమ పిల్లల చదువులను సాగించలేని దుస్థితిలో ఉన్నార న్నారు. జర్నలిస్టుల కుటుంబాల దయనీయ ఆర్థిక పరిస్థితులను మానవీయ కోణంలో పరిశీలించి, ప్రతి ఒక్క జర్నలిస్టు పిల్లలకు రాబోయే 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికే 50 శాతం ఫీజు రాయితీ వర్తించేలా తక్షణమే ప్రత్యేక సర్క్యులర్ జారీ చేయాలని సబ్ కలెక్టర్‌ను కోరారు.